వరద ముప్పు!

లంక గ్రామాలు విలవిల

ప్రకాశం బ్యారేజీ నుంచి 4.37 లక్షల క్యూసెక్కుల రాక

- శుక్రవారానికి వరద మరింతగా పెరిగే అవకాశం
- అధికారులను అప్రమత్తం చేసిన కలెక్టర్ బాలాజీ
- కలెక్టరేట్‌లో కంట్రోల్ రూమ్ ఏర్పాటు



పులిగడ్డ ఆక్విడెక్టు వద్ద వరద నీటి ప్రవాహం

కృష్ణానదికి వరద పోటెత్తింది. గురువారం సాయంత్రం ఆరు గంటల సమయానికి ప్రకాశం బ్యారేజీ నుంచి 4.43 లక్షల క్యూసెక్కుల నీటిని విడుదల చేశారు. శుక్రవారం నాటికి వరద ఉధృతి మరింత పెరిగే అవకాశం ఉన్నట్లు జలవనరులశాఖ అధికారులు అంచనా వేశారు. ప్రకాశం బ్యారేజీ వద్ద ఇప్పటికే ఒకటో నెంబరు ప్రమాదహెచ్చరిక అమలులో ఉన్నట్లు చెబుతున్నారు. పులిగడ్డ ఆక్విడెక్టు వద్ద వరదనీటి ప్రవాహం క్రమేపి పెరుగుతోంది. దీంతో లంక గ్రామాలకు వరద ముప్పు పొంచి ఉంది.

ఆంధ్రజ్యోతి-మచిలీపట్నం:వాయువ్య బంగాళాఖాతంలో ఏర్పడ్డ అల్పపీడనం ప్రభావంతో కురుస్తున్న వర్షాలకు కృష్ణానదికి వరద పోటెత్తింది. ఎగువ ప్రాజెక్టుల నుంచి వరద నీరు భారీ వచ్చి చేరుతుండటంతో ప్రకాశం బ్యారేజీ నుంచి నీటిని దిగువకు విడుదల చేస్తున్నారు. దీంతో కృష్ణమ్మ కడలివైపు పరుగులు తీస్తోంది.

అధికారులు అప్రమత్తంగా ఉండాలి: కలెక్టర్ బాలాజీ

కృష్ణానదికి పెద్దఎత్తున వరద వస్తున్న నేపథ్యంలో కలెక్టర్ బాలాజీ అధికారులను అప్రమత్తం చేశారు. ఈ సందర్భంగా ఆయన మీడియాతో మాట్లాడారు. వరద పరిస్థితులను జిల్లా యంత్రాంగం ఎప్పటికపుడు అంచనా వేస్తోందన్నారు. కృష్ణానది తీరం వెంబడి మండలాల అధికారులను అప్రమత్తం చేశామని తెలిపారు. తోట్లవల్లూరు మండలంలో వరద ఉధృతి అధికంగా ఉండటంతో అక్కడ రక్షణ చర్యల కోసం ఎన్‌డీఆర్‌ఎఫ్ బృందాన్ని అందుబాటులో ఉంచాలని ప్రభుత్వానికి లేఖ రాశామన్నారు. వరద పరిస్థితులను ఎప్పటికపుడు తెలుసుకునేందుకు కలెక్టరేట్‌లో 08672-252572 నెంబరుతో కంట్రోల్ రూమ్‌ను ఏర్పాటు చేశామని

మిగతా 6లో..

జిల్లాలో భారీ వర్షం

జిల్లాలో రెండు రోజుల పాటు భారీ వర్షం కురిసింది. బుధవారం ఉదయం 8.30 గంటల వరకు నందివాడలో అత్యధికంగా 52.4 మిల్లీమీటర్లు, అత్యల్పంగా అవనిగడ్డలో 6.2 మిలీట్లమీటర్లు వర్షం పడింది. జిల్లా సగటు వర్షపాతం 24.0 మిల్లీమీటర్లుగా నమోదైంది. గురువారం ఉదయం 8.30 గంటల వరకు కోడూరులో అత్యధికంగా 61.4 మిల్లీమీటర్లు, అత్యల్పంగా నందివాడలో 16.8 మిల్లీమీటర్లు, జిల్లా సగటు వర్షపాతం 36.09 మిల్లీమీటర్లుగా నమోదైంది. సెప్టెంబరు 1వ తేదీ వరకు కోస్తాతీరం వెంబడి పలు ప్రాంతాల్లో ఉరుములు, మెరుపులతో కూడిన వర్షం కురుస్తుందని వాతావరణశాఖ హెచ్చరికలు జారీ చేసింది.

జై దూండీ గణేశ్

విజయవాడలో మహాగణపతిని దర్శించుకున్న సీఎం చంద్రబాబు

విజయవాడ, (విద్యాధరపురం), ఆగస్టు 28 (ఆంధ్రజ్యోతి): విజయవాడ సితార సెంటర్ లేబర్ కాలనీ గ్రౌండ్‌లో దూండీ గణేశ్ సేవా సమితి ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన 72 అడుగుల మహాగణపతిని ముఖ్యమంత్రి చంద్రబాబు దర్శించుకున్నారు. స్వామివారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. మన ప్రజా ప్రభుత్వంలో సూపర్ సిక్స్‌ను సూపర్ హిట్ చేసి వాడవాడలా బ్రహ్మాండంగా గణేశ్ ఉత్సవాలు జరుపుకుంటున్నామన్నారు. తొలుత సీఎం చంద్రబాబుకు దూండీ గణేశ్ సేవా సమితి వ్యవస్థాపకుడు, ఏపీ ఆర్యవైశ్య కార్పొరేషన్ చైర్మన్ దూండీ రాకేశ్, ఎన్టీఆర్ జిల్లా కలెక్టర్ జి.లక్ష్మీశ, జిల్లా పోలీస్ కమిషనర్ ఎస్.వి.రాజశేఖర్ బాబు, మునిసిపల్ కమిషనర్ ధ్యానచంద్ర, విజయవాడ ఎంపీ కేశినేని శివనాథ్(చిన్ని), ఎమ్మెల్యేలు బొండా ఉమామహేశ్వరరావు, టీడీపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి, మాజీ ఎమ్మెల్సీ బుద్దా వెంకన్న, టీడీపీ రాష్ట్ర అధికార ప్రతినిధి, దూదేకుల కార్పొరేషన్ అభివృద్ధి సంస్థ చైర్మన్ నాగుల్ మీరా, స్వచ్ఛాంధ్ర కార్పొరేషన్ చైర్మన్ పట్టాభి తదితరులు ఘన స్వాగతం పలికారు.



మహాగణపతికి నమస్కరిస్తున్న సీఎం చంద్రబాబు, చిత్రంలో దూండీ గణేశ్ సేవా సమితి వ్యవస్థాపకుడు దూండీ రాకేశ్, విజయవాడ ఎంపీ కేశినేని శివనాథ్, ఎమ్మెల్యే బొండా ఉమామహేశ్వరరావు, స్వచ్ఛాంధ్ర కార్పొరేషన్ చైర్మన్ పట్టాభి తదితరులు



ఎడ్లంక పరిరక్షణకు చర్యలు

- దీవి కోతను పరిశీలించిన సెంట్రల్ డిజైన్స్ అధికారులు

8

రాష్ట్ర ఉత్తమ పాఠశాలగా నున్న

- స్కూల్ ఆఫ్ ఎక్సలెన్స్ అవార్డులకు జిల్లాస్థాయిలో ఐదు పాఠశాలల ఎంపిక

8

కొత్త టీచర్ల ఆనందోత్సాహాలు

డీఎస్సీ అభ్యర్థుల సర్టిఫికెట్ల

పరిశీలన ప్రారంభం

తొలిరోజు 1,048 అభ్యర్థుల విద్యార్హత పత్రాల తనిఖీ

- పర్యవేక్షించిన ప్రత్యేక అధికారి ప్రసన్నకుమార్, డీఈవోలు
- అధిక మార్కులు వచ్చినా కాల్ లెటర్‌లు రాలేదని పలువురు ఫిర్యాదు
- ఒకటి రెండు రోజుల్లో వస్తాయంటున్న అధికారులు
- ఓపెన్ కేటగిరిలో ఎస్సీ, బీసీలకు పోస్టులు కేటాయించడం లేదంటున్న ఉపాధ్యాయ సంఘాలు



డీఎస్సీ అభ్యర్థుల సర్టిఫికెట్లను పరిశీలిస్తున్న అధికారులు

మచిలీపట్నం, ఆగస్టు 28 (ఆంధ్రజ్యోతి): డీఎస్సీ-2025లో అర్హత సాధించిన ఉమ్మడి కృష్ణాజిల్లా అభ్యర్థుల సర్టిఫికెట్ల పరిశీలన గురువారం ప్రారంభమైంది. మచిలీపట్నంలోని నోబుల్ కళాశాలలో ఉదయం ఎనిమిది గంటల నుంచే అభ్యర్థులు నోబుల్ కళాశాల వద్దకు చేరుకున్నారు. అభ్యర్థులు, వారి బంధువుల రాకతో నోబుల్ కళాశాలకు వెళ్లే రహదారి నిండిపోయింది. దీంతో ఈ ప్రాంతంలో పోలీసులు బందోబస్తును ఏర్పాటు చేశారు.

1,048 మంది అభ్యర్థులు హాజరు


డీఎస్సీ-2025లో అర్హత సాధించిన వారిలో 1,048 మంది అభ్యర్థులు సర్టిఫికెట్ల పరిశీలనకు హాజరయ్యారు. నోబుల్ కళాశాలలోని 21 గదుల్లో, గదికి 50 మంది చొప్పున అభ్యర్థులను కేటాయించి సర్టిఫికెట్‌లను పరిశీలించారు. ఒక్కో గదిలో ఎంఈవో, పాఠశాల ప్రధానోపాధ్యాయుడు, రెవెన్యూ అధికారి, టెక్నికల్ సిబ్బంది, పీడీ, పీఈటీ ఐదుగురితో కూడిన బృందం సర్టిఫికెట్‌లను పరిశీలించింది. ఒక్కో అభ్యర్థి మూడు సెట్‌ల జిరాక్సు కాపీలను అధికారులకు ఇచ్చారు. పాఠశాల విద్యాశాఖ అసిస్టెంట్ డైరెక్టర్ ప్రసన్నకుమార్, కృష్ణా డీఈవో పీవీజే రామారావు, ఎన్టీఆర్ జిల్లా డీఈవో యూవీ సుబ్బారావు, జిల్లా గిరిజన సంక్షేమశాఖ

మిగతా 6లో..

పెరిగిన ఇన్‌ఫ్లో

రెండు జలాశయాలకు భారీగా వరద

- ప్రకాశం బ్యారేజీ ఇన్‌ఫ్లో, అవుట్‌ఫ్లో 4.43 లక్షల క్యూసెక్కులు
- ఒకటో నంబరు ప్రమాద హెచ్చరిక జారీ
- సాయంత్రానికి పులిచింతలకు తగ్గిన ఇన్‌ఫ్లో
- పులిచింతల ఇన్‌ఫ్లో 2.41 లక్షల క్యూసెక్కులు
- అవుట్‌ఫ్లో 2.43 లక్షల క్యూసెక్కులు



ప్రకాశం బ్యారేజీ నుంచి దిగువకు విడుదల చేసిన నీరు

(ఆంధ్రజ్యోతి - విజయవాడ): జిల్లాలోని జలాశయాలకు వరద ఉధృతి మళ్లీ పెరిగింది. పులిచింతల ప్రాజెక్టు, ప్రకాశం బ్యారేజీ వద్ద వేర్వేరు పరిస్థితులు ఉన్నాయి. పులిచింతల ప్రాజెక్టుకు ఉదయం నుంచి పెరుగుతూ వచ్చిన ఇన్‌ఫ్లో రాత్రికి తగ్గుముఖం పట్టింది. ఉదయం ఆరు గంటలకు నాగార్జున సాగర్ ప్రాజెక్టు నుంచి పులిచింతలకు 3,67,940 క్యూసెక్కుల నీరు వచ్చింది. దిగువకు 3,74,212 క్యూసెక్కుల నీటిని విడుదల చేశారు. రాత్రికి ఈ నీటి పరిమాణం తగ్గింది. నాగార్జున సాగర్ ప్రాజెక్టు నుంచి వచ్చే నీటి పరిమాణం 2,41,000 క్యూసెక్కులకు తగ్గిపోయింది. దిగువకు 2,43,000 క్యూసెక్కుల నీటిని విడుదల చేస్తున్నారు. పులిచింతల ప్రాజెక్టుతోపాటు వాగుల నుంచి నీటి ప్రవాహం ఉండడంతో ప్రకాశం బ్యారేజీ వద్ద నీటిమట్టం క్రమంగా పెరుగుతోంది. బ్యారేజీకి

మిగతా 6లో..

ఏసీ బోగీలే టార్గెట్

రైళ్లలో మార్బుల్ వర్కర్ చేతివాటం

- 16న గుజరాత్‌కు చెందిన కుటుంబం ఆభరణాల బ్యాగ్ చోరీ
- నిందితుడిని పట్టుకున్న రైల్వే పోలీసులు
- రూ.8 లక్షల ఆభరణాలు స్వాధీనం
- నిందితుడిపై పలు చోరీ కేసులు

అతడి గురించి ఎవరిని అడిగినా మార్బుల్ పని చేస్తుంటాడని చెబుతారు. అతడి దృష్టి మాత్రం ఎప్పుడూ రైళ్లలోని ఏసీ బోగీలపైనే ఉంటుంది. రైలు గుర్తుకొచ్చినప్పుడల్లా స్టేషన్‌కు వెళ్లి ఒక సాధారణ టికెట్ కొనుగోలు చేస్తాడు. దానితో ఏసీ బోగీ ఎక్కుతాడు. బోగీ మొత్తం అటూఇటూ తిరుగుతాడు. తర్వాత ఏ వస్తువు కనిపిస్తే దాన్ని తీసుకుని ఆఫ్‌సైడ్ దిగి వెళ్లిపోతాడు. ఇలా విజయవాడ రైల్వేస్టేషన్ కేంద్రంగా రైళ్లలో వరుస చోరీలు చేస్తున్న యువకుడిని రైల్వే పోలీసులు గురువారం అరెస్టు చేశారు. దీనికి సంబంధించిన వివరాలను డీఎస్పీ రత్నరాజు, జీఆర్పీ ఇన్‌స్పెక్టర్ జీవీ రమణ, ఆర్పీఎఫ్ ఇన్‌స్పెక్టర్ ఫతే అలీబేగ్ వెల్లడించారు.



మీడియాకు వివరాలు వెల్లడిస్తున్న రైల్వే పోలీసులు

విజయవాడ, ఆగస్టు 28(ఆంధ్రజ్యోతి): గుంటూరుకు చెందిన అబ్దుల్ రెహ్మాన్ భవానీపురంలో కుటుంబంతో కలిసి ఉంటున్నాడు. అతడికి భార్య, కుమారుడు ఉన్నారు. మార్బుల్ పని చేసుకుంటూ కుటుంబాన్ని పోషిస్తున్నట్టుగా వ్యవహరిస్తాడు. మార్బుల్ పనికి వెళ్లే రెహ్మాన్‌కు చేతివాటం బాగా ఉంది. ఇంటి నుంచి పనికి వెళ్తున్నట్టు బయలుదేరిన రెహ్మాన్ నేరుగా విజయవాడ రైల్వేస్టేషన్‌కు చేరుకుంటాడు. అక్కడ ప్లాట్‌ఫాంలపై తిరుగుతూ వచ్చేపోయే రైళ్లలో ఏసీ బోగీలపై కన్నేస్తాడు. లోపలకు వెళ్లి పరిస్థితి తనకు అనుకూలంగా ఉంటే సెకన్ల వ్యవధిలో వస్తువులు మాయం చేస్తాడు.

సెల్‌ఫోన్లతో మొదలై..

రెహ్మాన్ ఇంతకుముందు రైల్వేస్టేషన్ తిరుగుతూ సెల్‌ఫోన్లను చోరీ చేసేవాడు. ఈ కేసుల్లో పోలీసులు పలుమార్లు అరెస్టు చేశారు. జైలు నుంచి బయటకు వచ్చిన తర్వాత రెహ్మాన్ టార్గెట్ మార్చుకున్నాడు. గుజరాత్‌కు చెందిన కొహీజం అనే వ్యక్తి కుటుంబ సభ్యులతో

మిగతా 6లో..

యూరియా విక్రయాలపై నిఘా

కలెక్టర్ బాలాజీ

ఆంధ్రజ్యోతి-మచిలీపట్నం: యూరియా విక్రయాలపై టాస్క్‌ఫోర్స్ బృందాలతో జిల్లా వ్యాప్తంగా నిఘా పెట్టినట్టు కలెక్టర్ బాలాజీ తెలిపారు. గురువారం ఆయన మీడియాతో మాట్లాడారు. గతేడాది కంటే ఈ ఏడాది ఇప్పటివరకు యూరియాను అధికంగా జిల్లాలోని పీఏసీఎస్‌లకు ఇచ్చామన్నారు. వరి పొలాలకు కాకుండా వేరే విధంగా యూరియాను వినియోగిస్తుండటంతో యూరియా విక్రయాల్లో కొంత గందరగోళం ఏర్పడిందన్నారు. యూరియాను దారి మళ్లించి అధిక ధరలకు విక్రయించే వారిపై కఠినంగా వ్యవహరిస్తామని కలెక్టర్ బాలాజీ తెలిపారు.



పల్లెల్లో కొలువైన గణనాథుడు

విఘ్నాలు తొలగించే విఘ్నేశ్వరుడికి జిల్లాలోని వీధులన్నీ పట్టం కట్టాయి. పండుగ రోజు తెల్లవారుజాము నుంచి ఎడతెరిపి లేకుండా కురిసిన వర్షాన్ని సైతం లెక్క చేయకుండా భక్తులు గణపతి విగ్రహాలు ఏర్పాటు చేసి పూజించారు. మచిలీపట్నంలోని సంతోష్ హోటల్ వద్ద ఏర్పాటు చేసిన మండపంలో మంత్రి కొల్లు రవీంద్ర ప్రత్యేక పూజలు నిర్వహించారు.

-ఆంధ్రజ్యోతి-మచిలీపట్నం టౌన్



కట్టలేరు డైవర్షన్ రహదారిపై వరద ప్రవాహం

వర్షాలు, వరదలపై అప్రమత్తంగా ఉన్నాం

- ప్రజలు ఆందోళన చెందాల్సిన అవసరం లేదు
- క్షేత్రస్థాయి అధికారులు సూచనలను పాటించండి
- కృష్ణా, బుడమేరు, మున్నేరు ప్రవాహంపై నిరంతర పర్యవేక్షణ
- ఎన్టీఆర్ జిల్లా కలెక్టర్ లక్ష్మీశ



సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ లక్ష్మీశ

కలెక్టరేట్, ఆగస్టు 28 (ఆంధ్రజ్యోతి) : జిల్లాలో వర్షాలు, వరదలపై పూర్తి అప్రమత్తంగా వున్నామని, కృష్ణానదితో పాటు బుడమేరు, మున్నేరులో ప్రవాహాలను నిరంతరం పర్యవేక్షిస్తున్నామని, ప్రజలు ఆందోళన చెందాల్సిన అవసరం లేదని ఎన్టీఆర్ జిల్లా కలెక్టర్ లక్ష్మీశ తెలిపారు. గురువారం కలెక్టర్ లక్ష్మీశ, కలెక్టరేట్‌లోని కమాండ్ కంట్రోల్ రూమ్ (సీసీసీ) నుంచి జిల్లాలో వర్షాలు, వరదల పరిస్థితిని సమీక్షించారు. రెవెన్యూ, ఇరిగేషన్, వైద్య, ఆరోగ్య, పంచాయతీరాజ్, ఇంజనీరింగ్, అగ్నిమాపక, విద్యుత్ తదితర శాఖల అధికారులతో చర్చించారు. అనంతరం ఆయన మీడియాతో మాట్లాడుతూ, గ్రామ, వార్డు సచివాలయం యూనిట్‌గా 24-7 ప్రత్యేక పర్యవేక్షణ బృందాలు, వరద స్పందన బృందాలు క్రియాశీలంగా వున్నాయన్నారు. కృష్ణా వరదకు సంబంధించి ఎప్పటికప్పుడు పరిస్థితిని పరివాహక గ్రామాల ప్రజలకు తెలియజేస్తున్నట్టు తెలిపారు. 95 గ్రామాల ప్రజలను అప్రమత్తం చేసినట్టు వెల్లడించారు. బ్యారేజీకి ఎగువ, దిగువ ప్రాంతాల ప్రజలకు ఎప్పటికప్పుడు సమాచారం అందిస్తున్నామన్నారు. కృష్ణానదిలో వరద ప్రవాహం పెరుగుతున్న నేపథ్యంలో మత్స్యకారులు చేపలవేటకు వెళ్లొద్దన్నారు. ఇబ్రహీంపట్నం మండలం చినలంక, పెదలంకకు చెందిన కుటుంబాలు సురక్షితంగా ఉండేందుకు చర్యలు తీసుకున్నట్టు వెల్లడించారు. బుడమేరు, మున్నేరులో ప్రవాహాలను నిరంతరం పర్యవేక్షిస్తున్నామని, వెలగలేరు రెగ్యులేటర్ వద్ద ప్రత్యేక బృందాలు వున్నాయన్నారు. ప్రస్తుతానికి ఈ వాగుల్లో ప్రవాహాలు సాధారణంగానే వున్నందున ఆందోళన చెందాల్సిన అవసరం లేదన్నారు. 32 పునరావాస కేంద్రాల్లో అన్ని సౌకర్యాలు కల్పించినట్టు వివరించారు. ముందుజాగ్రత్త చర్యల్లో ప్రజలు, అధికారులు, సిబ్బందికి సహకరించాలని, హెచ్చరికలను తేలిగ్గా తీసుకోవద్దని కలెక్టర్ లక్ష్మీశ పేర్కొన్నారు.

వర్షాలు, వరదల నేపథ్యంలో 9154970454 కలెక్టరేట్ కమాండ్ కంట్రోల్ కేంద్రం ఏర్పాటు చేశామని, ఇందులో సమన్వయ శాఖల అధికారులు, సిబ్బంది విధులు నిర్వర్తిస్తున్నట్టు తెలిపారు. జిల్లాలో వర్షపాతం.. వాగుల్లో ప్రవాహ

9154970454

పరిస్థితి.. తదితర అంశాలను నిరంతరం సేకరిస్తున్నట్టు తెలిపారు. రియల్ టైం సమాచారం అందుబాటులో వున్నందున ప్రజలు సమాచారం కోసమైనా, సహాయానికైనా కమాండ్ కంట్రోల్ కేంద్రానికి ఫోన్ చేయొచ్చని సూచించారు. ఆందోళన చెందాల్సిన అవసరం లేదని, అయితే జాగ్రత్తగా వుండాలని, వదంతులను నమ్మొద్దని కలెక్టర్ లక్ష్మీశ కోరారు.

వణికిస్తున్న.. వరద!



నల్లవాగు చప్టాపై వరద..



పెద్దాపురం - గూడెంమాధవరం గ్రామాల మధ్య ఏనుగుగడ్డ వాగు ఉధృతి



గుర్రపువాగు చప్టాపై ప్రవహిస్తున్న వరదనీరు

- భారీ వర్షాలకు పొంగుతున్న వాగులు, వంకలు
- నీట మునుగుతున్న పంటపొలాలు
- కాల్వలకు గండ్లు.. రోడ్లపైకి వరద నీరు
- పలు గ్రామాలకు స్తంభించిన రాకపోకలు

గంపలగూడెం/తిరువూరు, ఆగస్టు 28 (ఆంధ్రజ్యోతి) : అల్పపీడనం కారణంగా బుధవారం రాత్రి నుంచి కురుస్తున్న భారీ వర్షాలకు వాగులు పొంగి పొర్లుతున్నాయి. దీంతో పలు గ్రామాల మధ్య రాకపోకలు నిలిచిపోయాయి. గురువారం ఉదయం గంపలగూడెం మండలంలో 8.76 సెంటీమీటర్ల వర్షపాతం నమోదైనట్టు అధికారులు తెలిపారు. తోటమూల-వినగడప రహదారిమధ్య కట్టలేరు డైవర్షన్ రహదారిపై వరదనీరు ప్రవహిస్తుండటంతో రాకపోకలు నిలిచిపోయాయి. కట్టలేరు పరీవాహక ప్రాంతాలైన, కనుమూరు, అనుముల్లంక, వినగడప, కొత్తపల్లి గ్రామాల్లో పంటపొలాలు నీటమునిగాయి. కొణిజర్ల-నెమలి రహదారిలో నల్లవాగు, నెమలి-ఉమ్మడిదేవరపల్లి గ్రామాల మధ్య అనురాధ వాగు పొంగిపొర్లడంతో గ్రామాల మధ్య రాకపోకలు నిలిచిపోయాయి. పంట పొలాలు నీటమునిగాయి. గంపలగూడెం నల్లచెరువు అలుగునుంచి భారీగా వరదనీరు ప్రవహిస్తుండటంతో పొలాలు నీటమునిగాయి. గంపగూడెం-చింతలపాడు గ్రామాల మధ్య రాకపోకలు నిలిచిపోయాయి. మొగుళ్లవాగు పొంగి ప్రవహిస్తుండటంతో అమ్మిరెడ్డిగూడెం-గోసవీడు గ్రామాలకు రాకపోకలు స్తంభించాయి. ఊటుకూరు ఊరచెరువు అలుగునుంచి నీరు భారీగా ప్రవహిస్తుండటంతో ఆయకట్టు పరిధిలోని పొలాలు నీటమునిగాయి.

● తిరువూరు ఎన్ఎస్పీ మేజర్ కాల్వకు సుందరయ్యకాలనీ సమీపంలో గండిపడి నీరు సమీపంలోని ఖాళీ స్థలం మీదుగా, కుంకుడు కాల్వ ద్వారా దేవసముద్రంలోకి చేరుతోంది. కాల్వకు పడిన గండిని, అధికారులు, యుద్ధప్రాతిపదికన ఇసుక బస్తాలతో పూడ్చారు. చింతలపాడు, గంపలగూడెం మధ్య గుర్రవాగు చప్టా పైనుంచి వరదనీరు ప్రవహిస్తుండటంతో రహదారిలో ఉదయం రాకపోకలు నిలిచిపోయాయి. దాదాపు అన్ని చెరువులు నిండిపోవడంతో చేరడంతో, పొతులచెరువు వద్ద కట్టుకాల్వకు గండి పెట్టి పడమటి వాగుకు నీటిని మళ్లించారు. ఎగువన తెలంగాణలో భారీ వర్షాలు, వరదలకు పడమటివాగు, కట్టలేరు, తూర్పువాగు, వెదుళ్లవాగు, విప్లవవాగుల్లో నీరు భారీగా ప్రవహిస్తోంది. అధికారులు గ్రామాల్లో పర్యటించి ప్రజలను అప్రమత్తం చేస్తున్నారు.



కాల్వకు పడిన గండి

ఉప్పొంగిన దొర్లింతలవాగు

జి.కొండూరు : ఎడతెరిపి లేని వర్షాలకు గడ్డమణుగు లోయ నుంచి ప్రవహించే దొర్లింతల వాగుకు వరద పోటెత్తింది. వాగు ఆక్రమణకు గురికావడంతో వరద నీరు జి.కొండూరు పంటపొలాలు, సమీపంలో ఉన్న ఇళ్లలోకి చేరుతోంది. వాగు ఆక్రమణలు తొలగించకపోవడం వల్ల పొలాలు, ఇళ్లు నీట మునుగుతున్నాయని బాధితులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

ఏనుగుగడ్డ వాగుకు వరద

వీరులపాడు : ఏనుగు గడ్డ వాగుకు వరద పోటెత్తింది. పెద్దాపురం-గూడెంమాధవరం రహదారిపై రాకపోకలు నిలిచిపోయాయి. ఏనుగుగడ్డ వాగు పరీవాహక ప్రాంతంలో పంట పొలాలు ముంపుబారిన పడ్డాయి.

నీటమునిగిన పంట పొలాలు

పెనుగంచిప్రోలు: మండలంలో కురుస్తున్న వర్షాలకు వాగులు, వంకలు పొంగి ప్రవహిస్తున్నాయి. లింగగూడెం పెనుగంచిప్రోలు మధ్య అలుగు గురువారం పొంగి ప్రవహించింది అనిగండ్లపాడు నుంచి పెనుగంచిప్రోలు రహదారిలో కూచి వాగు, దూళ్లవాగుల మధ్య వరద పోటెత్తడంతో ముచ్చింతల, అనిగండ్లపాడు గ్రామాలకు చెందిన సుమారు 50 ఎకరాల పంట పొలాలు ముంపునకు గురయ్యాయి. భారీ వర్షం వల్ల పొలంలో నీరు నిలబడిపోతుందని, ప్రభుత్వం శాశ్వత పరిష్కారం చూడాలని రెండు గ్రామాల రైతులు విజ్ఞప్తి చేస్తున్నారు. వరద వల్ల మండలంలో ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా తహసీల్దార్ ఎ.శాంతిలక్ష్మి, పోలీస్, రెవెన్యూ సిబ్బందిని అప్రమత్తం చేశారు.



విద్యుత్ సబ్‌స్టేషన్ ప్రారంభ కార్యక్రమంలో మంత్రి రవీంద్ర

గ్రామీణ ప్రజలకు మెరుగైన విద్యుత్

- సబ్‌స్టేషన్‌ను ప్రారంభించిన మంత్రి రవీంద్ర

మచిలీపట్నం టౌన్, ఆగస్టు 28 (ఆంధ్రజ్యోతి) : గ్రామీణ ప్రాంత ప్రజలకు మెరుగైన విద్యుత్ కల్పిస్తున్నామని ఎక్సైజ్ శాఖ మంత్రి కొల్లు రవీంద్ర పేర్కొన్నారు. రుద్రవరం ఏపీ టిడ్కో ఇళ్ల వద్ద రూ. 7.05 కోట్ల వ్యయంతో నిర్మించిన 33/11 కేవీ సబ్‌స్టేషన్‌ను, చిన్నాపురం సబ్‌స్టేషన్ నుంచి కోన సబ్‌స్టేషన్ వరకు, కోడూరు సబ్‌స్టేషన్ కోసం రూ. 3.75 కోట్ల వ్యయంతో నిర్మించిన 33 కేవీ ఇంటర్ లింకింగ్ లైన్లను గురువారం రాత్రి మంత్రి ప్రారంభించారు. ఈ సందర్భంగా మంత్రి రవీంద్ర మాట్లాడుతూ, టిడ్కో ఇళ్ల వద్ద సబ్‌స్టేషన్ నిర్మించడం వల్ల శారదానగర్, గుండుపాలెం, గొల్లపాలెం, కృష్ణారావుపేట ప్రాంతాలకు విద్యుత్ సరఫరా చేయడం జరుగుతుందన్నారు. మచిలీపట్నంలోలో ఓల్టేజి సమస్యను పరిష్కరించేందుకు మరో విద్యుత్ సబ్‌స్టేషన్‌ను ఏర్పాటు చేస్తామన్నారు. మచిలీపట్నం వాసులకు త్వరలో ఇళ్లస్థలాలు ఇస్తామన్నారు. ఆర్టీసీ చైర్మన్ కొనకళ్ల నారాయణ మాట్లాడుతూ, టిడ్కో ఇళ్లకు నాణ్యమైన విద్యుత్‌ను అందించాలని మంత్రి కొల్లు రవీంద్ర ముఖ్యమంత్రిని ఒప్పించి నిధులు తీసుకువచ్చారన్నారు. కార్యక్రమంలో సీపీడీసీఎల్ ఎస్ఈ సత్యానందం, మచిలీపట్నం వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ కుంచే దుర్గాప్రసాద్, కార్పొరేటర్లు చిత్తజల్లు నాగరాము, సమతాకీర్తి, ఏఈలు, డీఈలు పాల్గొన్నారు.

పాత ఇనుపసామాను షాపులో పేలుడు

- మహిళకు తీవ్ర గాయాలు
- ఆలస్యంగా వెలుగుచూసిన ఘటన

మచిలీపట్నంక్రైమ్, ఆగస్టు 28 (ఆంధ్రజ్యోతి) : పాత ఇనుపసామాను షాపులో పేలుడు సంభవించి మహిళకు తీవ్రగాయాలైన ఘటన చిలకలపూడి పోలీస్‌స్టేషన్ పరిధిలో జరిగింది. మంగళవారం జరిగిన ఘటన ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. షాపులో పనిచేస్తున్న మహిళ చేయి పేలుడు ధాటికి నుజ్జయ్యింది. మహిళను మచిలీపట్నం ప్రభుత్వాసుపత్రికి తరలించారు. పరిస్థితి విషమంగా ఉండటంతో విజయవాడ ప్రభుత్వాసుపత్రికి తరలించారు. పేలుడు సంభవించిన ప్రదేశాన్ని చిలకలపూడి సీఐ నబి పరిశీలించారు. విజయవాడ నుంచి ఫోరెన్సిక్ నిపుణులు ఘటనా స్థలాన్ని పరిశీలించారు. చిలకలపూడి పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

ఏసీ బోగీలే టార్గెట్

(5వ పేజీ తరువాయి)

కలిసి చెన్నైలో బంధువుల ఇంట్లో జరిగే శుభకార్యక్రమానికి బయలుదేరారు. మొత్తం ఐదుగురు కుటుంబసభ్యులు ఈ నెల 15న గుజరాత్‌లో భగత్‌కోటి ఎక్స్‌ప్రెస్ ఏ1లో ఎక్కారు. రైలు 16న సాయంత్రం నాలుగు గంటలకు విజయవాడ చేరుకుంది. అక్కడే ఉన్న రెహ్మాన్ ఏ1 బోగీలోకి ఎక్కాడు. కోహీజం కుటుంబం నిద్రలో ఉండటంతో బెర్త్ కింద ఉన్న బ్యాగ్‌ను మాయం చేశాడు. తర్వాత చూసుకోగా బ్యాగ్ కనిపించలేదు. దీంతో ఆయన టోల్‌ఫ్రీ నంబరు 139కి ఫోన్ చేసి ఫిర్యాదు చేశారు. సమాచారం జీఆర్పీ పోలీసులకు అందింది. బాధితులు తిరిగి గుజరాత్ మార్గంలో 24న జీఆర్పీకి రాతపూర్వకంగా ఫిర్యాదు చేశారు. వారు వెంటనే రంగంలో దిగి సీసీ ఫుటేజీలను పరిశీలించగా రైలు బోగీలోకి ఎక్కినట్టు కనిపించింది. బ్యాగ్ తీసుకుని రెండో ద్వారం వైపు దిగినట్టు కనిపించింది. నిందితుడి కోసం పోలీసులు మొత్తం 104 సీసీ కెమెరాల ఫుటేజీలను పరిశీలించారు. రెహ్మాన్ చోరీ చేసినట్టు గుర్తించారు. బ్యాగ్‌ను ఇంటికి తీసుకెళ్లి భద్రంగా ఉంచి.. అవసరాల కోసం అందులో ఉన్న బంగారు ఉంగరం, గొలుసును తాకట్టు పెట్టాడు. వన్‌టౌన్‌లో రెహ్మాన్‌ను పోలీసులు అరెస్టు చేశారు. అతడి నుంచి మొత్తం రూ.10,61,318బంగారు వస్తువులు, సెల్‌ఫోన్లు, ల్యాప్‌టాప్‌లు స్వాధీనం చేసుకున్నారు. ఇందులో రూ.8లక్షల ఆభరణాలు కోహీజం కుటుంబానికి సంబంధించినవే. నిందితుడిపై ఇంతకుముందు సెల్‌ఫోన్ చోరీ కేసులు ఉన్నాయని పోలీసులు తెలిపారు.

మినుము వర్షార్పణం!

- భారీ వర్షాలతో రైతుకు నష్టం

(కంచికచర్ల - ఆంధ్రజ్యోతి) భారీ వర్షాలు మినుము పంటకు తీవ్ర నష్టం మిగిల్చాయి. చేతికి వసున్న తరుణంలో భారీ వర్షాలు పడటంతో పండిన పంటంతా వర్షార్పణమైంది. రెండు రోజుల్లోనే పంట నాశనం కావటంతో రైతులు అల్లాడుతున్నారు. కంచికచర్ల, వీరులపాడు మండలాల్లో తొలకరిలో రైతులు పదివేల ఎకరాలకు పైగా పెసర, మినుము పంట సాగు చేశారు. ఎకరానికి రూ. 25 వేలు పెట్టుబడి పెట్టారు. పంటలు కోతకు రావడంతో ఇతర ప్రాంతాల నుంచి పదుల సంఖ్యలో కోత యంత్రాలను తెచ్చారు. వారం రోజులు పొడి వాతావరణంలో దాదాపుగా పెసర కోతలు పూర్తయ్యాయి. మినుము కోతలు 50 శాతం వరకు అయ్యాయి. ఎకరానికి రెండు నుంచి నాలుగు బస్తాల వరకు దిగుబడి వస్తున్న సమయంలో రెండ్రోజులు ఎడతెగకుండ కురిసిన భారీ వర్షాలకు మినుము పూర్తిగా దెబ్బతిన్నది. తేమ ఆరకపోవటంతో కాయలు కుళ్లిపోతున్నాయి. గింజలు మొలకలు వస్తున్నాయి. పంటంతా వర్షం వల్ల నేలపాలైంది. చేలల్లో ఇక గింజకూడా రాదని రైతులు వాపోతున్నారు. రెండు రోజులు పొడి వాతావరణం ఉంటే.. పంటంతా సజావుగా ఇంటికి వచ్చేదని, అలాంటిది కళ్లముందే పంట నాశనం కావటంతో రైతులు అల్లాడుతున్నారు. యంత్రాలతో కోయటం వల్ల గింజల్లో తేమ శాతం ఎక్కువగా ఉండటంతో పలువురు రైతులు కంచికచర్ల బైపాస్ రోడ్డు వెంబడి సర్వీసు రోడ్డులో పెసలు, మినుములు ఆరబోశారు. రాశులపై పట్టాలు కప్పినప్పటికీ ఫలితం లేకుండా పోయింది. గింజలు తడిసిపోయాయి. చినుకులు పడుతుండటంతో ఆరబోయటానికి కూడా వీలులేకుండా పోయింది. కోసిన పంట కూడా దెబ్బతినటంతో అన్ని విధాలుగా నష్టపోవాల్సి వచ్చిందని రైతులు వాపోతున్నారు.



కంచికచర్ల సర్వీస్ రోడ్డులో ఆరబోసిన పెసలు, మినుము, గింజల నుంచి వచ్చిన మొలకలు

వరద ముప్పు!

(5వ పేజీ తరువాయి)

చెప్పారు. బుడమేరు పరివాహక ప్రాంతంలోనూ గత రెండు రోజులుగా వర్షపాతం అధికంగా నమోదైందని తెలిపారు. బుడమేరుకు గతేడాది ఏర్పడిన వరద పరిస్థితులను దృష్టిలో పెట్టుకుని ఆయా గ్రామాల ప్రజలను అప్రమత్తం చేయాలని అధికారులకు ఆదేశాలు ఇచ్చామన్నారు. వరద ఉధృతి పెరిగితే లంక గ్రామాల ప్రజలను పునరావాస కేంద్రాలకు తరలిస్తామని కలెక్టర్ తెలిపారు. ఇప్పటికే ఆర్డీవోలను ఆయా మండలాలకు పంపి వరద ఉధృతిని అంచనా వేస్తున్నామన్నారు. ఇప్పటివరకు లంక గ్రామాల్లో పంటలకు ఎలాంటి నష్టం జరగలేదన్నారు. అవనిగడ్డ మండలంలోని యడ్లంక గ్రామానికి వెళ్లే కాజ్‌వే వరద నీటి ప్రవాహం కారణంగా మరింతగా కోతకు గురవుతోందని చెప్పారు. కేంద్ర ప్రభుత్వ బృందం ఈ కాజ్‌వేను గురువారం పరిశీలించిందని తెలిపారు. ఈ బృందం సభ్యులు ఇచ్చిన నివేదిక ప్రకారం తరుపరి చర్యలు తీసుకుంటామని వివరించారు.

డీఎస్సీ అభ్యర్థుల సర్టిఫికెట్ల పరిశీలన

(5వ పేజీ తరువాయి)

అధికారి ధూర్జటి ఈ కార్యక్రమాన్ని పర్యవేక్షించారు. డీఎస్సీలో అర్హత సాధించి సర్టిఫికెట్‌లు సమర్పించిన వారిలో ఒకరిద్దరు అభ్యర్థులపై పోలీస్ కేసులు నమోదై ఉన్నట్లుగా తేలడంతో, వారిపై ఎలాంటి కేసులు నమోదయ్యాయనే అంశంపైనా అధికారులు వివరాలు సేకరించారు.

కాల్ లెటర్‌లు రాలేదని ఆందోళన

నోబుల్ కళాశాలకు పలువురు అభ్యర్థులు వచ్చి తమకు డీఎస్సీలో అధిక మార్కులు వచ్చినప్పటికీ కాల్‌లెటర్ రాలేదని, తమ కంటే తక్కువ మార్కులు వచ్చిన వారికి కాల్ లెటర్‌లు వచ్చాయని అధికారుల దృష్టికి తెచ్చారు. ఈ సర్టిఫికెట్ల పరిశీలన ఒక్కరోజులోనే పూర్తికాదని, నాలుగైదు రోజులపాటు కొనసాగుతుందని పాఠశాల విద్యాశాఖ అసిస్టెంట్ డైరెక్టర్ ప్రసన్నకుమార్, కృష్ణా డీఈవో పీవీజే రామారావు చెప్పారు. ఒకటీ రెండు రోజుల్లో కాల్ లెటర్లు వస్తాయని, కంగారు పడవద్దని అభ్యర్థులకు వివరించారు.

ఎస్సీ, బీసీలకు ఓపెన్ కేటగిరిలో పోస్టులు చూపడం లేదు

ఎస్సీ, బీసీ సామాజిక వర్గాలకు చెందిన అభ్యర్థులు వంద మార్కులకు గాను 94 నుంచి 95 మార్కులు సాధించినా, వారికి ఓపెన్ కేటగిరిలో పోస్టింగ్ చూపకుండా, వారి సామాజిక వర్గం కోటాలోనే పోస్టింగ్‌లు చూపుతున్నారని ఉపాధ్యాయ సంఘాల నాయకులు అంటున్నారు. అధిక మార్కులు సాధించిన ఎస్సీ, బీసీ సామాజిక వర్గాల వారికి ఓపెన్ కేటగిరిలో పోస్టులు ఇస్తే, తక్కువ మార్కులు సాధించిన వారిలో కొందరికి టీచర్ పోస్టులు వస్తాయని పేర్కొంటున్నారు. అధిక మార్కులు సాధించిన ఎస్సీ, బీసీ అభ్యర్థులకు ఓపెన్ కేటగిరిలో పోస్టులు చూపకుండా కృష్ణా, గుంటూరు జిల్లాల అధికారులు వ్యవహరిస్తున్నారని, ఈ విషయాన్ని ప్రభుత్వం దృష్టికి తీసుకువెళ్లాలని ఉపాధ్యాయ సంఘాలకు చెందిన వాట్సాప్ గ్రూపుల్లో మెసేజ్‌లు గురువారం చక్కర్లు కొట్టాయి.



పట్టుబడ్డ యూరియా లారీ

అక్రమంగా తరలిస్తున్న యూరియా లారీ పట్టివేత

ఊటుకూరు(గంపలగూడెం) : మినీలారీలో అక్రమంగా తరలిస్తున్న యూరియాను పోలీసులు స్వాధీనం చేసుకుని ఇద్దరిని అరెస్టు చేశారు. ఎస్ఐ ఎన్.శ్రీనివాసరావు తెలిపిన వివరాల ప్రకారం.. గురువారం నందిగామలోని మనగ్రోమోర్ దుకాణం నుంచి మినిలారీలో పోనాయాపాలెం మీదుగా అక్రమంగా తెలంగాణ రాష్ట్రం ఖమ్మంజిల్లాకు చెందిన కల్లూరుకు తరలిస్తున్నారన్న సమాచారంతో, ఊటుకూరు చెక్‌పోస్టు వద్ద తనిఖీ చేయగా మినీ లారీలో 40 బస్తాల యూరియా, 35 ఆర్గానిక్ పొటాష్ బస్తాలు ఉన్నట్టు ఎస్ఐ తెలిపారు. వ్యవసాయశాఖాధికారి వల్లభనేని హరీష్‌కుమార్ ఫిర్యాదు మేరకు అక్రమంగా రవాణా చేస్తున్న మార్గంపూడి కుమార్, కన్నెగంటి సాగర్‌లను అదుపులోకి తీసుకొని కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు, వాహనాన్ని స్టేషన్‌కు తరలించినట్టు ఎస్ఐ తెలిపారు.

హిజ్రాలతో దాడి చేయించి ..

- స్థల యజమానులపై అద్దెదారుడు దౌర్జన్యం
- ఆలస్యంగా కేసు నమోదు
- రక్షణ కల్పించండి : వృద్ధ దంపతులు



వీరభద్రరావు, జయలక్ష్మి

తోట్లవల్లూరు, ఆగస్టు 28 (ఆంధ్రజ్యోతి) : దుకాణాల వెంట వ్యాపారులను, రహదారులపై ప్రజల నుంచి డబ్బులు వసూలుచేసే హిజ్రాలు కిరాయి గూండాల అవతారం ఎత్తడం సంచలనంగా మారింది. కానుక తీసుకుని నెత్తిపై చేయివేసి దీవించే హిజ్రాలు తమకు సంబంధంలేని విషయంలో ఓ వ్యక్తి నుంచి డబ్బులు తీసుకుని దంపతులపై దాడిచేశారు. కోర్టులో కేసు వాపసు తీసుకోవాలని హెచ్చరించారు. ఈ ఘటన తోట్లవల్లూరు మండలం యాకమూరులో చోటు చేసుకుంది. యాకమూరుకు చెందిన గుర్రాల వీరభద్రరావు, జయలక్ష్మి దంపతులు గురువారం మీడియా సమావేశంలో వివరాలు వెల్లడించారు. వీరభద్రరావు దంపతులు ఉయ్యూరులో 1997లో ఇద్దరు వ్యక్తుల నుంచి 400గజాల స్థలాన్ని కొనుగోలు చేశారు. స్థలాన్ని రిజిస్టర్ చేసుకోకుండా స్టాంప్ పేపర్లపై అగ్రిమెంటు రాసుకున్నారు. షాపు, నివాస గృహాలు నిర్మించి ఓ వ్యక్తికి అద్దెకిచ్చారు. అయితే ఆ వ్యక్తి ఆ స్థలాన్ని అతని పేరుపై రాయించుకుని వారిని మోసం చేయడంతో వీరభద్రరావు దంపతులు 2016లో కోర్టులో కేసు వేశారు. ఈ స్థలంపై కోర్టు ఇంజక్షన్ ఆర్డర్ ఉండగా.. ఆ వ్యక్తి గతంలో ఉన్న కరెంట్ కనెక్షన్‌ను తొలగించి అతని పేరుతో కొత్త కనెక్షన్ తీసుకున్నాడు. దీనిపై వీరభద్రరావు దంపతులు ఈ నెల 21న ఆ వ్యక్తిని నిలదీయగా.. వారిపై ఆయన రాయితో దాడి చేశాడు. దీంతో వారు ఉయ్యూరు పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. ఈ క్రమంలో వారిపై కక్ష గట్టిన ఆ వ్యక్తి తమపైకి హిజ్రాలతో దాడి చేయించారని వృద్ధ దంపతులు ఆరోపించారు. ఈ నెల 22న మధ్యాహ్నం ఐదుగురు హిజ్రాలు ఆటోలు వచ్చి తనపై విచక్షణారహితంగా దాడిచేశారని, సుత్తితో కొట్టటంతో తలపగిలిందని, అడ్డు వచ్చిన తన భర్త వీరభద్రయ్యపై కూడా వారు దాడి చేశారని జయలక్ష్మి తెలిపారు. కోర్టులో ఇంజక్షన్ ఆర్డర్ విత్‌డ్రా చేసుకునేందుకు చంపేస్తామని హిజ్రాలు తన భర్తను హెచ్చరించి వెళ్లారని చెప్పారు.

ఎస్పీకి ఫిర్యాదు చేశాకే కేసు నమోదు

ఈ ఘటనపై తోట్లవల్లూరు పోలీసులు కేసు నమోదు చేయడంలో నిర్లక్ష్యంగా వ్యవహరించటంతో తాము ఈ నెల 25న మచిలీపట్నం వెళ్లి ఎస్పీకి ఫిర్యాదు చేయటంతో 27న నామమాత్రపు సెక్షన్లతో కేసు నమోదు చేశారని జయలక్ష్మి అన్నారు. నిందితులపై హత్యాయత్నం కేసు నమోదు చేయాలని ఆమె డిమాండ్ చేశారు. బుధవారం రాత్రి మళ్లీ ఇద్దరు హిజ్రాలు తన ఇంటికి వచ్చి తలుపు కొట్టారని, తర్వాత కుక్కలకు భయపడి పారిపోయారని అన్నారు. కాబట్టి, తమకు పోలీసులు రక్షణ కల్పించాలని ఆమె వేడుకున్నారు. ఈ ఘటనపై ఎస్ఐ సీహెచ్ అవినాష్‌ని వివరణ కోరగా బుధవారం రాత్రి కేసు నమోదు చేశామని.. నిందితులు ఎవరో, వారికి సుపారి ఎవరిచ్చారో తేలాక సెక్షన్లు మారుస్తామని చెప్పారు.



అనిగండ్లపాడు వద్ద చెరువును తలపిస్తున్న పొలాలు



హెచ్.ముత్యాలంపాడు వద్ద బుడమేరు డైవర్షన్ చప్టాపై ప్రవహిస్తున్న వరదను పరిశీలిస్తున్న కలెక్టర్ లక్ష్మీశ

లోతట్టు ప్రాంతాలు అప్రమత్తం

- కలెక్టర్ లక్ష్మీశ

జి.కొండూరు :బుడమేరు ముంపునకు గురయ్యే లోతట్టు ప్రాంతాల ప్రజలను అప్రమత్తం చేయాలని, ఎప్పటికప్పుడు వరద పరిస్థితిని సమీక్షించాలని స్థానిక అధికారులను ఎన్టీఆర్ జిల్లా కలెక్టర్ జి.లక్ష్మీశ ఆదేశించారు. గురువారం ఆయన జి.కొండూరు మండలం హెచ్.ముత్యాలంపాడు-కందులపాడు గ్రామాల మధ్య బుడమేరు లో లెవల్ చప్టాపై వరదను పరిశీలించారు. ప్రస్తుతం బుడమేరుకు వరద నిలకడగా ఉన్నా వర్షాలు పడుతున్న నేపథ్యంలో అప్రమత్తంగా ఉండాలని రెవెన్యూ, జలవనరుల శాఖ అధికారులను కలెక్టర్ ఆదేశించారు.

ముందస్తు జాగ్రత్తలు చేపట్టాలి

- ఎంపీ కేశినేని శివనాథ్

వన్‌టౌన్ : కృష్ణానదికి వరద ఉధృతి పెరుగుతున్న నేపథ్యంలో అధికారులు ముందస్తు జాగ్రత్తలు చేపట్టే విధంగా చర్యలుతీసుకోవాలని విజయవాడ ఎంపీ కేశినేని చిన్ని గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. కలెక్టర్ జి.లక్ష్మీశతో ఆయన ఫోన్‌లో మాట్లాడారు. తిరువూరులో వర్షాల ప్రభావంపై ప్రత్యేకంగా చర్చించారు. వాగుల ఉధృతి దృష్ట్యా రాకపోకలు నిలిపివేయాలని, అత్యవసర సహాయకచర్యలు వేగవంతం చేయాలని సూచించారు. గత అనుభవాల దృష్ట్యా అధికారులు ముందస్తు జాగ్రత్తలు తీసుకోవాలని కలెక్టర్‌కు సూచించారు. ప్రజలు కూడా అప్రమత్తంగా ఉండాలన్నారు.

పెరిగిన ఇన్‌ఫ్లో

(5వ పేజీ తరువాయి)

ఎగువ నుంచి 4,43,184 క్యూసెక్కుల వరద వస్తోంది. దీంతో బ్యారేజీ వద్ద ఒకటో నంబరు ప్రమాద హెచ్చరికను జారీ చేశారు. ఈ ఏడాదిలో ఇప్పటి వరకు మూడ సార్లు ఒకటో నంబరు ప్రమాద హెచ్చరికను జారీ చేశారు. బ్యారేజీ 70 గేట్లలో 69 గేట్లను పూర్తిస్థాయికి ఎత్తి ఎగువ నుంచి వస్తున్న నీటిని మొత్తం కిందికి వదులుతున్నారు. పాలేరు నుంచి 5,660, కీసర నుంచి 27,9025, పులిచింతల నుంచి 3,64,451 క్యూసెక్కుల నీరు వస్తోంది. తూర్పు, పశ్చిమ డెల్టా పరిధిలోని కాల్వలకు 8,540 క్యూసెక్కుల నీటిని ఇస్తున్నారు. తూర్పు డెల్టా పరిధిలోని కాల్వలకు 4,528, పశ్చిమ డెల్టా పరిధిలోని కాల్వలకు 4,012 క్యూసెక్కుల నీటిని వదులుతున్నారు.

బ్రాయిలర్ ధరలు



అమరావతి	(రూ.లలో)
బ్రాయిలర్ బర్డ్	112, 121, 132
చికెన్ విత్ స్కిన్	214
చికెన్ స్కిన్‌లెస్	224

నెక్ కోడిగుడ్డు ధర (100)

విజయవాడ జోన్ రైతు ధర రూ. 560

చేపల చెరువులకు వేలం

విజయవాడ రూరల్, ఆగస్టు 28 (ఆంధ్రజ్యోతి) : విజయవాడ రూరల్ మండలం నున్న గ్రామంలోని రెండు చేపల చెరువులకు అధికారులు గురువారం వేలం నిర్వహించారు. రూరల్ మండలం డిప్యూటీ ఎంపీడీవో ఎంటీడీ ప్రసాద్ సమక్షంలో పంచాయతీ కార్యాలయంలో నిర్వహించిన వేలంలో పలువురు పాల్గొన్నారు. మూడేళ్ల కాలపరిమితికి బూరుగుల చెరువును సత్తి దుర్గాప్రసాద్‌రెడ్డి రూ. 17.10 లక్షలకు వేలంలో దక్కించుకున్నాడు. జగ్గంవాని చెరువును మూడేళ్ల కాలపరిమితికి కిషోర్ కుమార్ రూ. 21 లక్షలకు వేలంలో దక్కించుకున్నాడు. కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి కోటా సురేష్‌బాబు, సర్పంచ్ కాటూరి సరళ, టీడీపీ నేతలు కలకోటి శ్రీనివాసరెడ్డి, యార్కారెడ్డి కోటిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.



ధర్నా చేస్తున్న కౌలు రైతు సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి రంగారావు

రైతులకు సకాలంలో ఎరువులు పంపిణీ చేయాలి

కంకిపాడు, ఆగస్టు 28 (ఆంధ్రజ్యోతి) : రైతులకు అవసరమైన ఎరువులు సకాలంలో పంపిణీ చేయాలని కౌలు రైతు సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి పంచకర్ల రంగారావు అన్నారు. వ్యవసాయ శాఖ కార్యాలయం వద్ద గురువారం కౌలు రైతు సంఘం ఆధ్వర్యంలో ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా రంగారావు మాట్లాడుతూ ఖరీఫ్ సీజన్ ప్రారంభమై రెండు నెలలు కావస్తున్నా నేటికి రైతులకు అవసరమైన ఎరువులు పంపిణీ చేయడంలో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు పూర్తిగా వైఫల్యం చెందాయని విమర్శించారు. సొసైటీలు, రైతు సేవా కేంద్రాల ద్వారా రైతులకు అందాల్సిన ఎరువులు అందడం లేదన్నారు. జె.రవి, వి.మరియదాసు, పి.దుర్గారావు, వి.శివశంకర్, లాం ఆశీర్వాదం, పి.ప్రసాద్, ఎం.చంటిబాబు, వి.జాన్ మోజస్, సాంబశివరావు, నాగేశ్వరరావు పాల్గొన్నారు.

పూడికతీత పనులు

గన్నవరం: చివరి పొలం వరకూ సాగు నీరందించేందుకే పంట కాల్వ శుభ్రం చేయిస్తున్నట్లు సర్పంచ్ మాదల రోహిణి అన్నారు. పురుషోత్తపట్నం ఊర చెరువు నుంచి వెళ్లే పంట కాల్వలో గురువారం సిల్ట్ తొలగించే పనులు ప్రారంభించారు. ఊర చెరువు నుంచి ఈ కాల్వ ద్వారా గ్రామ పొలాలతో పాటు సావరగూడెం, జక్కులనెక్కలం, వెదురుపావులూరు పొలాలకు నీరు వెళుతుందన్నారు. సుమారు 700 ఎకరాల రైతులకు మేలు జరుగుతుందన్నారు. పంచాయతీ కార్యదర్శి ప్రసాద్, పాల్గొన్నారు.


పంటకాలువలో పూడికతీస్తున్న ఎక్స్‌కవేటర్

భక్తిశ్రద్ధలతో వినాయక చవితి


తాడిగడప రైతుబజారు వద్ద వినాయకునికి పూజలు నిర్వహిస్తున్న బోడె హేమ, యార్లగడ్డ సుచిత్ర

పెనమలూరు, ఆగస్టు28(ఆంధ్రజ్యోతి) : మండలంలో వినాయకచవితి వేడుకలు వైభవంగా నిర్వహించారు. జోరు వానను సైతం లెక్క చేయకుండా వేడుకలను జరుపుకున్నారు. తాడిగడప ఎన్టీఆర్ రైతు బజారులో నిర్వహించిన వేడుకల్లో రైతుబజారు కమిటీ ఏర్పాటు చేసిన విగ్రహం వద్ద బోడె ప్రసాద్ సతీమణి హేమచౌదరి, తెలుగుమహిళ రాష్ట్ర అధికార ప్రతినిధి యార్లగడ్డ సుచిత్ర ప్రత్యేక పూజలు నిర్వహించారు. రైతు బజారు ప్రాంగణంలో అన్నసంతర్పణ నిర్వహించారు. యనమలకుదురు ఎన్టీఆర్ గార్డెన్స్ వద్ద జరిగిన కార్యక్రమంలో మొక్కపాటి శ్రీనివాస్, తాడిశెట్టి వీరాస్వామి, బలగం కొండలు మట్టి వినాయక ప్రతిమలను పంపిణీ చేశారు.గంగూరు, గోసాల, వణుకూరు, పెదపులిపాక, చోడవరం, పోరంకి, పెనమలూరుల్లో ప్రజలు పందిళ్లలో వినాయకుని పూజించారు.

హనుమాన్‌జంక్షన్: చలువ పందిళ్లలో వివిధ రూపాల్లో గణనాథుల విగ్రహాలు ఏర్పాటు చేసి పూజా కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు. ఆర్యవైశ్య కల్యాణ మండపంలో ఐదు అడుగుల మట్టి ప్రతిమను ఏర్పాటు చేసి పూజా కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు. సర్కిల్ ఆఫీస్ రోడ్డులో, ఆర్టీసీ బస్టాండ్ వద్ద, ఎంజీనగర్, హనుమాన్‌నగర్, తారకరామనగర్, సాయిరెసిడెన్సీ, ధరణీ రెసిడెన్సీ అపార్ట్‌మెంట్స్ వద్ద ఉత్సవాలు నిర్వహిస్తున్నారు.


ఉయ్యూరు చింతలతోటలో గణేశ్ విగ్రహంవద్ద రాజేంద్ర ప్రసాద్

హనుమాన్‌జంక్షన్‌రూరల్ : వినాయకచవితి సందర్భంగా వీరవల్లి పోలీస్‌స్టేషన్ పరిధిలో 50, హనుమాన్‌జంక్షన్ పోలీస్‌స్టేషన్ పరిధిలో 64 చోట్ల విగ్రహాలు ఏర్పాటు చేశారు. వైకుంఠలక్ష్మీపురంలో ఏర్పాటు చేసిన గణపతి విగ్రహం వద్ద వీహెచ్‌పీ జాతీయ ట్రస్టీ పుట్టగుంట సతీష్ కుమార్ ప్రత్యేక పూజలు చేశారు. కమిటీ సభ్యులు అన్నే చైతన్య, ఆట్లూరి సత్యన్నారాయణ పాల్గొన్నారు. వీరవల్లి గ్రామ యూత్ కమిటీ ఆధ్వర్యంలో భారీ మట్టి గణపతి ప్రతిమకు లంక సురేంద్ర మోహనబెనర్జీ, గుండపనేని ఉమావరప్రసాద్, ఉపసర్పంచ్ లంక అజయ్‌కుమార్ తదితరులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఎస్‌ఎస్‌ఎల్సీ ప్రాజెక్ట్ కమిటీ వైస్ చైర్మన్ ఆళ్ల గోపాలకృష్ణ, కసుకుర్తి ఆర్జునరావు, కానుమోలులోజంక్షన్ ఎస్సై-2 మూర్తి దంపతులు ప్రత్యేక పూజలో పాల్గొన్నారు. మాజీ సర్పంచ్ చింతలవెంకట శివఅప్పారావు, పీఏసీఎస్ చైర్‌పర్సన్ దన్నే దుర్గారావు తదితరులు పాల్గొన్నారు. మల్లవల్లి, రేమల్లె, కాకులపాడు, సింగన్నగూడెం, కోడూరుపాడు, బిళ్లనపల్లి, కొత్తపల్లి, వేలేరు, మడిచర్లలోగణపతి నవరాత్రి మహోత్సవాలు అంగరంగ వైభవంగా ప్రారంభమయ్యాయి.

కంకిపాడు :శ్రీగణేష్ ఉత్సవ కమిటీ ఆధ్వర్యంలో గోసాల సెంటర్‌లో ఏర్పాటు చేసిన వినాయకుని విగ్రహాన్ని గురువారం కంకిపాడు మాజీ ఎంపీపీ దేవినేని రాజా సందర్శించుకొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా అన్న సంతర్పణ కార్యక్రమం చేపట్టారు. ఉత్సవ కమిటీ సభ్యులు బి.బలరామ్, గంగరాజు, సత్య నారాయణ, రాంబాబు, దుర్గారావు, శంకర్, ఏసు, నవీన్, బి. సన్యాసిరావు, ఎం. మణి, పి. సత్యనారాయణ పాల్గొన్నారు.

ఉయ్యూరు : మండలంలో చవితి ఉత్సవాలు వేడుకగా నిర్వహించారు. ఉయ్యూరులో చింతలతోట ఫ్రెండ్స్ సర్కిల్ ఆధ్వర్యంలో గణేశ్ మహోత్సవాలతో పాటు పలుచోట్ల గణేశ్ మండపాలను మాజీ ఎమ్మెల్సీ వైవీబీ రాజేంద్రప్రసాద్ దర్శించి పూజలు చేశారు. ఆకునూరులో తెలుగుయువత జిల్లా అధ్యక్షు దండ మూడి చౌదరి, గ్రామసర్పంచ్ గోలి వసంతకుమార్, కిరణ్ పూజల్లో పాల్గొన్నారు.


ఆర్యవైశ్య సంఘం ఏర్పాటు చేసిన మట్టి వినాయకుడు

గన్నవరం: దావాజీగూడెం రామాలయంలో అర్చకులు రామాచార్యులు కలశ స్థాపన, అఖండ దీపారాధన చేసి పూజలు ప్రారంభించారు. వినాయక వ్రతం జరిపారు. భక్తులకు తీర్థ ప్రసాదాలు అందజేశారు. కేసరపల్లి రామాలయం దగ్గర ఏర్పాటు చేసిన విగ్రహం వద్ద ప్రత్యేక పూజలు చేస్తున్నారు.

మట్టి ప్రతిమల పంపిణీ

కంకిపాడు :వినాయక చవితి సందర్భంగా ఏఎంసీ చైర్మన్ అన్నే ధనయ్య బుధవారం కంకిపాడు, ఉప్పలూరు గ్రామంలో ఉచితంగా వినాయకుని ప్రతిమలు పంపిణీ చేశారు. భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. కార్యక్రమంలో ఉప్పలూరు పీఏసీఎస్ అధ్యక్షుడు పడవల మధుసూదనరావు, మాజీ ఏఎంసీ చైర్మన్ కొణతం సుబ్రహ్మణ్యం, గ్రామ పార్టీ అధ్యక్షుడు చలసాని రాధాకృష్ణమూర్తి, కొండవీటి శివయ్య, మల్లేశ్వరరావు, లాం చంద్రరావు తదితరులు పాల్గొన్నారు.


ఉప్పలూరులో వినాయకుని మట్టి ప్రతిమలను పంపిణీ చేస్తున్న ఏఎంసీ చైర్మన్ అన్నే ధనయ్య తదితరులు

సాంకేతిక ఆవిష్కరణలకు క్వాంటమ్ దోహదం

కానూరు, ఆగస్టు28(ఆంధ్రజ్యోతి): విద్యార్థుల సాంకేతిక ఆవిష్కరణలకు క్వాంటమ్ టెక్నాలజీలు భవిష్యత్ కంప్యూటరింగ్ ఎంతగానో దోహదపడుతుందని సిద్ధార్థ డీమ్డ్ యూనివర్సిటీ వైస్‌చాన్సలర్ ప్రొఫెసర్ పరుచూరి వెంకటేశ్వరరావు అన్నారు. ఇంటర్నల్ హ్యాకథాన్‌ను గురువారం కానూరులోని సిద్ధార్థ వర్సిటీ ఆడిటోరియంలో నిర్వహించారు. ముఖ్యఅతిథిగా హాజరైన వీసీ వెంకటేశ్వరరావు మాట్లాడుతూ కమ్యూనికేషన్, ఇన్నోవేషన్ ఎకోసిస్టమ్స్ రూపకల్పనలో విద్యార్థుల పాత్రను వివరించారు. ఆధునిక సాంకేతిక పరిజ్ఞానాల ఆధారంగా, వాస్తవ సమస్యలకు వినూత్న పరిష్కారాలను సమర్పించేందుకు ఇది ఒక అద్భుతమైన వేదికగా నిలిసిందన్నారు. వీసీ డాక్టర్ ఏవీ రత్నప్రసాద్, వర్సిటీ ఇంజనీరింగ్ పాఠశాల డీన్ డాక్టర్ డి. వెంకట్రావు, డి. రాజేశ్వరరావు పాల్గొన్నారు.

పెనమలూరు: గంగూరు ధనేకుల ఇంజనీరింగ్ కళాశాలలో గురువారం హ్యాకథాన్-2025 కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరయిన నాగార్జున యూనివర్సిటీ వైస్ చాన్సలర్ కె.గంగాధరరావు మాట్లాడుతూ విద్యార్థుల ప్రతిభను వెలికితీయడంలో, సృజనాత్మక ఆలోచనలకు వేదిక కల్పించడంలో ఇటువంటి కార్యక్రమాలు కీలక పాత్ర పోషిస్తాయన్నారు. ప్రస్తుతం ప్రపంచం క్వాంటమ్ కంప్యూటింగ్, కృత్రిమ మేధ(ఏఐ), సైబర్ సెక్యూరిటీ వంటి అత్యాధునిక సాంకేతికతల దిశగా దూసుకుపోతోందన్నారు. హ్యాకథాన్‌లో 53జట్లు తమ పేర్లను నమోదు చేసుకోగా వాటిలో ఐదు జట్లను ఎంపిక చేశారు. వచ్చే నెల 10న రెండు జట్ల తరపున కృష్ణా, గుంటూరు, ప్రకాశం జిల్లాల విద్యార్థులు తమ ప్రాజెక్టులు ప్రదర్శిస్తారని తెలిపారు. కళాశాల ప్రిన్సిపాల్, డైరెక్టర్, డీన్లు, హెచ్‌వోడీలు హ్యాకథాన్ పోస్టరు ఆవిష్కరించారు. చైర్మన్ ధనేకుల రవీంద్రనాథ్ ఠాగూర్, కరస్పాండెంటు భవానీ ప్రసాద్, డైరెక్టర్ రవిప్రసాద్, ప్రిన్సిపాల్ డాక్టర్ రవి కడియాల, డీన్లు పాల్గొన్నారు.

ఎంఎస్ఎంఈ వర్క్‌షాపు నేడు

హనుమాన్‌జంక్షన్, ఆగస్టు 28(ఆంధ్రజ్యోతి) : కేంద్ర ప్రభుత్వం చేపట్టిన రాంప్ ఎంఎస్ఎంఈ పెర్ఫార్మెన్స్ కార్యక్రమంలో భాగంగా గ్రామాల్లో సర్వే ద్వారా గుర్తించిన ఔత్సాహిక పారిశ్రామిక వేత్తల రిజిస్ట్రేషన్ కార్యక్రమం శుక్రవారం ఎంపీడీవో కార్యాలయంలో నిర్వహిస్తున్నట్లు ఇన్‌చార్జి ఎంపీడీవో తిరుమల త్రినాథరావు గురువారం ప్రకటనలోపేర్కొన్నారు. ఔత్సాహిక పారిశ్రామిక వేత్తలను జిల్లా పరిశ్రమల శాఖలో రిజిస్టరు చేయడంతో పాటు పరిశ్రమల ఏర్పాటుపై అవగాహన కల్పించడం జరుగుతుందన్నారు.

సదరం క్యాంప్ నేడు, రేపు

పెన్షన్ లబ్ధికి దివ్యాంగ సర్టిఫికెట్లు తీసుకోవడానికి అర్హులైన దివ్యాంగులకు మచిలీపట్నంలో శుక్ర, శనివారాల్లో సదరం క్యాంప్ నిర్వహిస్తున్నట్లు బాపులపాడు ఇన్‌చార్జి ఎంపీడీవో తిరుమల త్రినాథరావు తెలిపారు. అవసరమైన వారంతా సదరం క్యాంప్‌ను సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

పర్యావరణాన్ని పరిరక్షించుకుందాం

● పొల్యూషన్ కంట్రోల్ బోర్డ్ చైర్మన్ కృష్ణయ్య

హనుమాన్‌జంక్షన్‌రూరల్, ఆగస్టు 28(ఆంధ్రజ్యోతి): పారిశ్రామికవాడలో వెలువడే కాలుష్య కారకాలను నియంత్రించి పర్యావరణ పరిరక్షణకు కృషి చేయాలని ఏపీపీసీబీ(ఆంధ్రప్రదేశ్ పొల్యూషన్ కంట్రోల్ బోర్డ్) చైర్మన్ డాక్టర్ పి.కృష్ణయ్య పారిశ్రామికవేత్తలకు సూచించారు. మల్లవల్లి (ఏపీఐఐసీ) లోని వివిధ పరిశ్రమలను గురువారం క్షేత్రస్థాయిలో పరిశీలించారు. అశోక్‌లేలాండ్, మోహన్ స్పింటెక్స్, వెంకటేశ్వర పేపర్ మిల్‌తో పాటు వివిధ పరిశ్రమల్లో ఉత్పత్తుల తయారీ, కాలుష్యాన్ని తగ్గించేందుకు తీసుకున్న చర్యలను పరిశీలించారు. పరిశ్రమల నుంచి వెలువడే వాయుకాలుష్యాన్ని నివారించేలా మొక్కలు పెంచాలని, పారిశ్రామిక వ్యర్థాలతో కూడిన చెత్తను సురక్షితంగా తరలించడం, మురుగు నీటి శుద్ధి తదితర విషయాలపై పరిశ్రమల ప్రతినిధులతో చర్చించారు. పారిశ్రామిక ఉత్పత్తులు తరలించేందుకు అన్ని సౌకర్యాలు అందుబాటులో ఉన్న మల్లవల్లి పారిశ్రామికవాడ మరింత అభివృద్ధి చేసేలా తన వంతు సహకారం అందిస్తామని చైర్మన్ కృష్ణయ్య పారిశ్రామికవేత్తలకు హామీ ఇచ్చారు. కార్యక్రమంలో పీసీబీ ఈఈ శ్రీనివాసులు, అశోక్‌లేలాండ్ యూనిట్ ఇంచార్జి శ్రీధరన్, మోహన్ స్పింటెక్స్ ప్రతినిధి రవికుమార్, పాల్గొన్నారు.


అశోక్‌లేలాండ్ యూనిట్‌ను పరిశీలిస్తున్న రాష్ట్ర పొల్యూషన్ కంట్రోల్ బోర్డ్ చైర్మన్ కృష్ణయ్య

సుంకర రత్నకుమారికి పలువురి నివాళి

కానూరు, ఆగస్టు28(ఆంధ్రజ్యోతి): జవహర్ ఆటోనగర్ ఐలా సర్వీస్ సొసైటీ మాజీ చైర్మన్ సుంకర దుర్గాప్రసాద్ సతీమణి సుంకర రత్నకుమారి నిర్యాణం(పెదకర్మ) కార్యక్రమం గురువారం తాడిగడప వంద అడుగుల రోడ్డులోని అన్నేవారి కల్యామండపంలో జరిగింది. కార్యక్రమానికి ఆర్టీసీ చైర్మన్ కొనకళ్ల నారాయణ, తూర్పు ఎమ్మెల్యే గద్దె రామ్మోహన్, పెనమలూరు ఎమ్మెల్యే బోడె ప్రసాద్, స్వచ్ఛభారత్ కార్పొరేషన్ చైర్మన్ పట్టాభి, విజయవాడ మాజీ మేయర్ కోనేరు శ్రీధర్, అన్నే శివనాగేశ్వరరావు, ప్రముఖ పారిశ్రామికవేత్త కొగంటి సత్యం, ఆటో ఎలక్ట్రికల్ అసోసియేషన్ అధ్యక్షుడు అబ్దుల్ కలాం, కత్తిక శివనాగేశ్వరరావు, బి. కోటేశ్వరరావు, కొమ్మిడి శ్రీనివాసరెడ్డి, గౌస్‌ఖాన్, బి. నాగేశ్వరరావు, సామ్రాట్, ఎండీ రిజ్వాన్, టి.చంద్రశేఖర్, జాస్తి సురేష్ తదితరులు పాల్గొని రత్నకుమారి చిత్రపటానికి పూలమాలలువేసి నివాళులర్పించారు. ఈసందర్భంగా ఆమె భర్త సుంకర దుర్గాప్రసాద్‌తోపాటు కుటుంబసభ్యులకు సానుభూతి తెలిపారు. కార్యక్రమంలో సంఘాల నేతలు, ఆటోనగర్‌లోని వివిధ కార్ఖానాల్లో పనిచేసే సిబ్బంది పాల్గొన్నారు.


సుంకర రత్నకుమారి చిత్రపటానికి పూలమాలవేసి నివాళులర్పిస్తున్న కొనకళ్ల, గద్దె


రికార్డులు తనిఖీ చేస్తున్న ఆర్డీవో హేలాషారోన్, సునీల్

రికార్డుల తనిఖీ

ఉయ్యూరు, ఆగస్టు 28 (ఆంధ్రజ్యోతి) : కలవపాముల పీఏసీఎస్‌లో రికార్డుల తనిఖీ కొనసాగుతుంది. పీఏసీఎస్‌లో యూరియా అమ్మకాల్లో అవకతవకలు బయటపడటంతో రెవెన్యూ, వ్యవసాయశాఖ, సివిల్ సైప్లస్ అధికారుల బృందం రెండు రోజులుగా రికార్డులు, అమ్మకాలకు సంబంధించి బిల్లు పుస్తకాలు తనిఖీ చేపట్టారు. ఉయ్యూరు ఆర్డీవో హేలాషారోన్ , గన్నవరం ఏడీఏ సునీల్, తహసీల్దార్ సురేశ్‌కుమార్, మండలవ్యవసాయ అధికారి బి.నిస్సీగ్రేస్ పీఏసీఎస్‌లో జరుగుతున్న రికార్డుల తనిఖీని పరిశీలించారు. సంవత్సరాల తరబడి పీఏసీఎస్‌లో అవకతవకలు జరిగినట్టు తనిఖీల్లో బయట పడుతున్నట్టు సమాచారం.

లబ్ధిదారులకు సీఎంఆర్ఎఫ్ చెక్కులు

పెనమలూరు: పేదవారికి ఆర్థిక భరోసాగా ముఖ్యమంత్రి సహాయనిధి ఉంటోందని ఎమ్మెల్యే బోడె ప్రసాద్ అన్నారు. గురువారం పోరంకి టీడీపీ కార్యాలయంలో చెక్కుల పంపిణీ కార్యక్రమంలో ఆయన పాల్గొని మాట్లాడారు. నియోజకవర్గంలోని 20మందికి రూ. 32.3లక్షల విలువైన చెక్కులను అందజేశారు. కార్యక్రమంలో అనుమోలు ప్రభాకరరావు, కోయ ఆనంద్‌ప్రసాద్, తాతపూడి గణేష్, యార్లగడ్డ సుచిత్ర, వీరంకి గురుమూర్తి, ఎర్నేని వేదవ్యాస్, పీతా గోపీచంద్, శొంఠి శివరాంప్రసాద్, అబ్రహాం పాల్గొన్నారు.

ఎమ్మెల్యే యార్లగడ్డ కోలుకోవాలని పూజలు

హనుమాన్‌జంక్షన్‌రూరల్ : వైరల్ ఫీవర్‌తో బాధపడుతున్న ఎమ్మెల్యే యార్లగడ్డ వెంకట్రావు త్వరగా కోలుకోవాలని అంపాపురం గ్రామానికి చెందిన ఎన్నారై కోడె రేవంత్ ఆధ్వర్యంలో గురువారం సీతారామాంజనేయస్వామి దేవస్థానంలో 101 కొబ్బరికాయలు కొట్టి ప్రత్యేక పూజలు నిర్వహించారు. కార్యక్రమంలో టీడీపీ అధ్యక్షుడు సుంకర రాజా వేణుగోపాల్, అన్నే శ్రీనివాసరావు, బజారు వెంకటేశ్వరరావు, హరికృష్ణ, రమాదేవి పాల్గొన్నారు.

యోగా పోటీల్లో పీవీపీ సిద్ధార్థ విద్యార్థుల ప్రతిభ

కానూరు, ఆగస్టు28(ఆంధ్రజ్యోతి): పశ్చిమ గోదావరి జిల్లా ప్రత్తిపాడు సరస్వతీ విద్యాలయంలో జరిగిన రాష్ట్రస్థాయి యోగా పోటీల్లో కానూరులోని పీవీపీ సిద్ధార్థ ఇంజనీరింగ్ కళాశాల విద్యార్థులు ప్రతిభ కనపరిచారు. ఇంజనీరింగ్ రెండో సంవత్సరం చదివే భుక్యా ఈశ్వరి సిల్వర్ మెడల్, టీడీ జగదీష్ బ్రాంజ్ మెడల్, మూడో సంవత్సరం చదివే వసుంధర గంగూ ఐదో స్థానంలో నిలిచారు. ఈసందర్భంగా గురువారం కళాశాలలో జరిగిన కార్యక్రమంలో ప్రిన్సిపాల్ డాక్టర్ కొండపల్లి శివాజీబాబు, ఫిజికల్ డైరెక్టర్ సాంబశివరావు న విద్యార్థులను, యోగా మాస్టార్ మూర్తిని అభినందించారు.


విద్యార్థులను అభినందిస్తున్న ప్రిన్సిపల్ శివాజీబాబు తదితరులు

స్మార్ట్ రేషన్‌కార్డుల పంపిణీ

ఉయ్యూరు : ఉయ్యూరు 16వ వార్డులో స్మార్ట్ రేషన్ కార్డుల పంపిణీని నగరపంచాయతీ మాజీ చైర్మన్ జంపాన పూర్ణచంద్రరావు గురువారం ప్రారంభించారు. ఈసందర్భంగా మాట్లాడుతూ సంక్షేమం, అభివృద్ధికి కూటమి కృషిచేస్తుందన్నారు. బాలకృష్ణ, శ్రీనివాస్, వెంకటేశ్వరరావు, కుచేలుడు తదితరులు పాల్గొన్నారు.

విద్యుత్ భారాలు తగ్గించాలి : సీపీఎం


జంక్షన్ సెంటర్‌లో సీపీఎం ఆధ్వర్యంలో నిర్వహించిన ప్రతిజ్ఞా ప్రదర్శన

హనుమాన్‌జంక్షన్, ఆగస్టు 28(ఆంధ్రజ్యోతి) : ప్రభుత్వం విద్యుత్ చార్జీల భారాన్ని తగ్గించాలని సీపీఎం జిల్లా కార్యదర్శి వై.నరసింహారావు అన్నారు. 2000లో విద్యుత్ చార్జీల వ్యతిరేక ప్రదర్శన సమంలో జరిగిన పోలీస్ కాల్పుల్లో అసువులు బాసిన రామకృష్ణ, విష్ణువర్దన్ రెడ్డి, బాలస్వామికి నివాళులు అర్పించారు. గురువారం ప్రతిజ్ఞా దినం పాటించారు. జంక్షన్ సెంటర్ సీపీఎం నాయకులు, కార్యకర్తలు ప్రదర్శన నిర్వహించారు. కార్యక్రమంలో పాల్గొన్న నరసింహారావు మాట్లాడుతూ ఎన్నికల్లో విద్యుత్ భారాలను తగ్గిస్తామని హామీ ఇచ్చిన కూటమి ప్రజల్ని మోసం చేసిందని విమర్శించారు. 14నెలల్లో సర్దుబాటు చార్జీల రూపంలో ప్రజలపై కోట్లు భారం వేసిందన్నారు. అమరవీరుల స్ఫూర్తితో విద్యుత్ చార్జీలపై పోరాటం చేయాల్సిన అవసరం మళ్లీ వచ్చిందని నరసింహారావు తెలిపారు. కార్యక్రమంలో మండల కార్యదర్శి జేత శ్రీనివాసరావు, అబ్దుల్ బారి, వంగపండు రామకృష్ణ, రాజనాల సురేష్ పాల్గొన్నారు.

గన్నవరం: స్మార్ట్ మీటర్లను వ్యతిరేకించాలని సీపీఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు కళ్లం వెంకటేశ్వరరావు అన్నారు. వామపక్షాల ఆధ్వర్యంలో స్మార్ట్ మీటర్లకు వ్యతిరేకంగా గాంధీబొమ్మ సెంటర్‌లో గురువారం నిరసన తెలిపారు. సీఎం చంద్రబాబు, స్మార్ట్ మీటర్ల గురించి మాట్లాడకపోవటం బాధాకరమన్నారు. కాట్రగడ్డ రామచంద్రజోషి, మల్లంపల్లి అంజనేయులు, అనుమోలు వెంకటేశ్వరరావు, సర్దార్, మిరప నాగేశ్వరరావు పాల్గొన్నారు.


హనుమాన్‌జంక్షన్‌రూరల్ : విద్యుత్ పోరాట అమరవీరుల స్ఫూర్తితో ప్రజావ్యతిరేక విధానాలపై పోరాడతామని సీపీఎం నాయకుడు బర్రె లెనిన్ అన్నారు. బండారుగూడెంలో విద్యుత్ చార్జీలు తగ్గించాలన్నారు. కార్యక్రమంలో జీవరత్నం, పాల్గొన్నారు.

ఉయ్యూరు : ప్రభుత్వం విద్యుత్ చార్జీల వడ్డనకు సిద్ధమైందని కౌలురైతు సంఘం రాష్ట్ర కార్యదర్శి ఎం.హరిబాబు అన్నారు. గురువారం ఉయ్యూరు 15వ వార్డులో సంస్మరణ కార్యక్రమం నిర్వహించి నివాళులర్పించారు. హరిబాబు మాట్లాడుతూ బషీర్ బాగ్ ప్రభావంతో 25ఏళ్ల కాలంలో ఎన్ని ప్రభుత్వాలు మారినా విద్యుత్ చార్జీలు పెంపునకు సాహసించలేదన్నారు. మరలా చంద్రబాబు చార్జీల పెంపునకు తెరతీస్తే వామపక్షాలన్నీ ఏకమై ప్రజలతో మరో ఉద్యమానికి పూనుకుంటుందని హెచ్చరించారు. జిల్లా సెక్రటరియేట్ సభ్యుడు కె.శివనాగేంద్రం, మాదల వెంకటేశ్వరరావు, పి.పవన్, బి.రాజేశ్ తదితరులు పాల్గొన్నారు.


ఉయ్యూరు 15వ వార్డులో విద్యుత్ అమరవీరుల సంస్మరణ సభలో నివాళులర్పిస్తున్న హరిబాబు


గన్నవరంలో నిరసన తెలుపుతున్న వామపక్ష నాయకులు

కంకిపాడు:పేదలపై ప్రభుత్వం విద్యుత్ భారాలను మోపితే ఉద్యమిస్తామని సీపీఎం జిల్లా కమిటీ సభ్యులు పంచకర్ల రంగారావు హెచ్చరించారు. మండేపూడి నాగభూషణ్ రెడ్డి భవన్‌లో విద్యుత్ అమరవీరుల సంస్మరణ సభ జరిగింది. ఈ సందర్భంగా రంగారావు మాట్లాడుతూ 25 సంవత్సరాల క్రితం పోలీసులు జరిపిన కాల్పుల్లో ముగ్గురు ఉద్యమ కారులు అమరలు అయ్యారన్నారు. విద్యుత్ చార్జీలు పెంపు నిర్ణయాన్ని కూటమి ప్రభుత్వం విరమించుకోవాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో వి.శివశంకర్, వి. జానహమోజెస్, పి.దుర్గారావు, ఎం.చంటి, వి.రమేష్, జె.రవి, పాల్గొన్నారు.



అమరావతి రైతులకు నేడు ప్లాట్ల ఈ-లాటరీ

కలెక్టరేట్, ఆగస్టు 28 (ఆంధ్రజ్యోతి): ప్రజా రాజధాని అమరావతి నిర్మాణానికి సీఆర్‌డీఏ పరిధిలో భూ సమీకరణ పథకంలో భూములను సీఆర్‌డీఏకి అప్పగించిన పెనుమాక జరీబు రైతులకు ప్లాట్లు కేటాయించేందుకు ఆగస్టు 29 (శుక్రవారం) సాయంత్రం 4గంటల నుంచి విజయవాడ లెనిన్ సెంటర్‌లోని సీఆర్‌డీఏ ప్రధాన కార్యాలయంలో ఈ-లాటరీ జరుగుతుందని కమిషనర్ కార్యాలయం అధికారులు గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ-లాటరీలో భాగంగా 52 మంది రైతులకు 84 ప్లాట్లను ఆన్‌లైన్ ర్యాండమ్ సిస్టమ్ ద్వారా కేటాయించడం జరుగుతుందన్నారు. వీటిలో 51 రెసిడెన్షియల్ ప్లాట్లు, 33 కమర్షియల్ ప్లాట్లు ఉన్నాయి. రైతులు ఈ-లాటరీకి హాజరుకావాలని సీఆర్‌డీఏ అధికారులు ఆ ప్రకటనలో కోరారు.

నేడు అమరావతిలో జాబ్‌మేళా

కలెక్టరేట్, ఆగస్టు 28 (ఆంధ్రజ్యోతి): ఆంధ్రప్రదేశ్ నైపుణ్యాభివృద్ధి, శిక్షణ శాఖ ఆధ్వర్యంలో సీఆర్‌డీఏ మద్దతుతో నేడు (శుక్రవారం) ఉదయం 10 గంటల నుంచి తుళ్లూరులోని నాక్-సీఆర్‌డీఏ స్కిల్ హబ్ సెంటర్‌లో 'జాబ్ మేళా' నిర్వహిస్తున్నట్టు సీఆర్‌డీఏ అధికారులు గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. ఎంపికైన అభ్యర్థులకు అమరావతి, చుట్టుపక్కల ఉపాధి అవకాశాలు కల్పించబడతాయన్నారు. సెన్స్ సెమీకండక్టర్ అండ్ ఐటీ సొల్యూషన్స్ ప్రైవేట్ లిమిటెడ్, బీఎస్ఆర్ ఇన్ఫ్రాటెక్ ఇండియా లిమిటెడ్, ఎస్‌బీఐ లైఫ్ ఇన్సూరెన్సు కో-లిమిటెడ్, భవ్య హెల్త్ సర్వీసెస్ ప్రైవేట్ లిమిటెడ్, సంతోష్ ఆటోమోటార్స్ ప్రైవేట్ లిమిటెడ్ వంటి ప్రముఖ కంపెనీలు ఈ మేళాలో పాల్గొంటాయి. ఇంజినీర్లు, డెవలప్‌మెంట్ మేనేజర్లు, ఫైనాన్షియల్ అడ్వైజర్లు (పార్ట్-టైమ్), రీజినల్ మేనేజర్లు, డిస్ట్రిక్ట్ మేనేజర్లు, ఆపరేషన్స్ ఎగ్జిక్యూటివ్‌లు, ఎమర్జెన్సీ మెడికల్ టెక్నీషియన్లు, డ్రైవర్లు, మార్కెటింగ్ ఎగ్జిక్యూటివ్‌లు, టీమ్ లీడర్లకు ఖాళీలు అందుబాటులో ఉన్నాయి. ఎస్ఎస్‌సీ, ఇంటర్, బీటెక్, ఎంఎల్‌టీ, బీఎస్సీ నర్సింగ్, ఏదైనా గ్రాడ్యుయేట్, పోస్ట్ గ్రాడ్యుయేట్ డిగ్రీలతో సహా అర్హత కలిగిన ఫ్రెషర్లు, అనుభవజ్ఞులైన అభ్యర్థులు హాజరు కావడానికి అర్హులు. ఎంపికైన అభ్యర్థులకు రూ.17 వేల నుంచి రూ.40వేల వరకు జీతాలు ఉంటాయన్నారు. కొన్ని పాత్రలకు అదనపు ప్రోత్సాహకాలు, జీతభత్యాలు అందించబడతాయన్నారు. అభ్యర్థులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. వివరాలకు సీఆర్‌డీఏ ఫెసిలిటేటర్‌ను లేదా శంకర్ - 9848424207 / శ్రీకర్ - 9963425999 సంప్రదించవచ్చన్నారు. పాల్గొనే వారు ఫెయిర్‌కు హాజరయ్యే ముందు నైపుణ్యం పోర్టల్ హెచ్‌టీటీపీఎస్://నైపుణ్యం.ఏపీ.జీఓవీ.ఇన్/ ద్వారా కూడా నమోదు చేసుకోవాలన్నారు.

30న కలెక్టరేట్‌లో జాబ్‌డ్రైవ్

కలెక్టరేట్, ఆగస్టు 28 (ఆంధ్రజ్యోతి): 'ఎన్టీఆర్ వికాస' ఆధ్వర్యంలో ఈనెల 30న శనివారం కలెక్టరేట్‌లోని ఎన్టీఆర్ వికాస కార్యాలయంలో జాబ్ డ్రైవ్ నిర్వహిస్తున్నట్టు ఎన్టీఆర్ వికాస ప్రాజెక్ట్ డైరెక్టర్ కే లచ్చారావు గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ జాబ్‌డ్రైవ్‌లో ఆఫ్ కెట్ ఐటీ సొల్యూషన్స్ ప్రైవేట్ లిమిటెడ్ (హైదరాబాద్)లో జావా డెవలపర్, పైథాన్ డెవలపర్ ఉద్యోగానికి బీఈ, బీటెక్ ఆల్ బ్రాంచ్‌లు (సివిల్ తప్ప), బీ కామ్, ఎంఎస్‌సి (కంప్యూటర్), ఎంఎస్‌సీ ఐటీ ఆర్ రిలేటెడ్ ఫీల్డ్ (2019 నుంచి 2025 ఉత్తీర్ణులైన వారు అర్హులు) ఉద్యోగానికి ఎంపికైన వారికి రూ.2.8 లక్షల నుంచి 4 లక్షల వరకు జీతం ఉంటుంది. హెచ్ఆర్ రిక్రూటర్ ఉద్యోగానికి ఎంబీఏ, బీబీఏ, (2019 నుంచి 2025 ఉత్తీర్ణులైన వారు అర్హులు) వీరికి నెలకు రూ.20 వేల జీతం + ఇన్సెంటివ్స్ ఉంటాయి. అలాగే ఫ్లిప్ కార్ట్ (విజయవాడ) కంపెనీలో ఎస్ఎస్‌సీ, ఆపైన ఉత్తీర్ణులైన వారు అర్హులు. వీరికి నెలకు రూ.15వేల నుంచి రూ.20 వేల వరకు జీతం ఉంటుంది. ఆసక్తి గల అభ్యర్థులు 30న శనివారం ఎన్టీఆర్ వికాస కార్యాలయం, కలెక్టరేట్, విజయవాడ వద్ద ఉదయం 9 గంటలకు సర్టిఫికెట్స్ జిరాక్సులతో హాజరుకావాలన్నారు. వివరాలకు 9849465427 సంప్రదించాలన్నారు.

పెన్షనర్లందరికీ టాక్స్ రిటర్న్ ఫైల్ తప్పనిసరి

జిల్లా జనరల్ సెక్రటరీ విష్ణువర్ధనరావు

విజయవాడ, ఆగస్టు 28 (ఆంధ్రజ్యోతి): ఇన్‌కం టాక్స్ పడిన పెన్షనర్స్ అందరూ 2024-25కు సంబంధించిన టాక్స్ రిటర్న్సు ఫైల్ చేయాలని జిల్లా జనరల్ సెక్రటరీ బీ విష్ణువర్ధనరావు గురువారం ఓ ప్రకటనలో తెలిపారు. ఇన్‌కంటాక్స్ నుంచి మినహాయింపు పొందిన పెన్షనర్లందరూ నగరంలోని తూర్పు సబ్‌ట్రెజరీ వద్ద ఫార్మ్ 16ను పాన్‌కార్డు చూపించి తీసుకోవాలన్నారు. టాక్స్ పడని పెన్షనర్స్ కూడా రూ.7.50 లక్షల వార్షిక ఆదాయం వారికి రూ.3.50 లక్షల వరకు టాక్స్‌లో మినహాయింపు వర్తిస్తుందన్నారు. దీనికోసం వారు నిల్ రిటర్న్ ఫైల్ చేయాలని విష్ణువర్ధన్ తెలిపారు. పెన్షనర్స్‌కు ఇబ్బంది లేకుండా పెన్షన్ హాలులో ఇన్‌కం టాక్స్ ఆడిటర్‌ను ఏర్పాటుచేసినట్టు తెలిపారు. ఇప్పటివరకు సుమారు 300 మందికి రిటర్న్ ఫైల్ చేశారన్నారు.

దుర్గగుడిలో ఘనంగా చవితి ఉత్సవాలు



పూజలు చేస్తున్న ఈవో శీనానాయక్

ఇంద్రకీలాద్రి, ఆగస్టు 28 (ఆంధ్రజ్యోతి): వినాయకచవితి పండుగను పురస్కరించుకుని బుధవారం దుర్గగుడిలో ఉత్సవాలు ఘనంగా ప్రారంభమయ్యాయి. స్థానాచార్యుడు విష్ణుభొట్ల శివప్రసాద్ శర్మ పర్యవేక్షణలో ఉదయం 8 గంటలకు పసుపు గణపతి పూజ అనంతరం కలశ స్థాపన, విశేష పత్రి పూజ, గణపతి హోమం నిర్వహించారు. కొండపైకి చిన్న రాజగోపురం సమీపంలోని మహాగణపతి స్వామి మందిరం వద్ద వినాయక వ్రత కథను చదివి అక్షింతలు అందజేసి ఆశీస్సులందించారు. అనంతరం సాయంత్రం 4 గంటలకు ఆవాహన దేవతా హోమాలు, హారతి, మంత్ర పుష్పం, తీర్థ ప్రసాద వినియోగం నిర్వహించారు. ఈ పూజలో ఈవో వీకే శీనానాయక్ దంపతులు పాల్గొని పూజలు నిర్వహించి స్వామి ఆశీస్సులు అందుకున్నారు. కాగా, రెండో రోజు గురువారం కూడా స్వామికి ప్రత్యేక పూజలు, హోమాలు నిర్వహించారు. అర్చకులు, వైదిక కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

క్యూలైన్ల ఏర్పాటు పనులు ప్రారంభం

దుర్గగుడిలో సెప్టెంబరు 22 నుంచి ప్రారంభం కానున్న దసరా ఉత్సవాలను పురస్కరించుకుని భక్తుల భద్రత నిమిత్తం అధికారులు గురువారం కొండపైన, కొండదిగువన క్యూలైన్ల ఏర్పాటుకు పనులు ప్రారంభించారు. స్థానాచార్యుడు పర్యవేక్షణలో ప్రత్యేక పూజలు జరగ్గా, ఈవో వీకే శీనానాయక్ పనులు ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దసరా ఉత్సవాల్లో అమ్మవారి దర్శనానికి వచ్చే భక్తులకు ఇబ్బందులు కలగకుండా ఏర్పాట్లు చేపడుతున్నామన్నారు. ఇంజనీరింగ్ అధికారులు, అర్చకులు, ఇంజనీరింగ్ అధికారులు కోటేశ్వరరావు, రాంబాబు, సిబ్బంది పాల్గొన్నారు.



కనకదుర్గానగర్‌లో బీటీ రోడ్డు నిర్మాణ పనులు

వేగంగా బీటీ రోడ్డు పనులు

కనకదుర్గానగర్‌లో అధికారులు చేపట్టిన బీటీ రోడ్డు పనులు వేగంగా జరుగుతున్నాయి. ఈ రోడ్డు అధ్వానంగా ఉండటంతో భక్తులు తీవ్ర ఇబ్బందులకు గురయ్యారు. దేవదాయ శాఖ కమిషనర్ కే రామచంద్ర మోహన్ దుర్గగుడి ఇన్‌చార్జి ఈవోగా బాధ్యతలు చేపట్టినపుడు ఈ బీటీ రోడ్డు నిర్మాణం చేపట్టాలని పనులు ప్రారంభించారు. తరువాత పనులు ఆగిపోయాయి. దసరా ఉత్సవాల నేపథ్యంలో అధికారులు మళ్లీ పనులు ప్రారంభించారు.

వాటర్ ప్రూఫ్ రేకుల ఏర్పాటు

విద్యాధరపురం, కుమ్మరిపాలెం సెంటర్‌వైపు నుంచి కొండపైకి వచ్చే భక్తుల కోసం దుర్గాఘాట్ ఎదురుగా అండర్ గ్రౌండ్ మార్గం వద్ద ఇంజనీరింగ్ అధికారులు వాటర్ ప్రూఫ్ రేకులను ఏర్పాటు చేశారు. దుర్గాఘాట్ నుంచి భక్తులు కేశఖండనశాల, అక్కడి నుంచి కొండ పైకి వెళ్లటానికి సులువుగా ఉంటుంది.

ఘనంగా వినాయక చవితి వేడుకలు

● కలెక్టరేట్‌లో జరిగిన పూజలో పాల్గొన్న కలెక్టర్ లక్ష్మీశ

కలెక్టరేట్, ఆగస్టు 28 (ఆంధ్రజ్యోతి): కలెక్టర్ కార్యాలయంలో బుధవారం వినాయక చవితి వేడుకలు ఘనంగా జరిగాయి. కలెక్టర్ లక్ష్మీశ అధికారులతో కలిసి పూజలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా కలెక్టర్ జిల్లా ప్రజలకు వినాయక చవితి శుభాకాంక్షలు తెలిపారు. ప్రజల జీవితాల్లో సుఖఃసంతోషాలు వెల్లివిరిసేలా అన్ని విఘ్నాలు తొలగి జిల్లా, రాష్ట్రం, దేశం సమగ్ర అభివృద్ధి చెందేలా దేవుని ఆశీస్సులుంటాయన్నారు. వేడుకల్లో డీఆర్‌వో ఎం లక్ష్మీ నరసింహం, ఏవో ఏ శ్రీనివాసరెడ్డి, కలెక్టరేట్ వివిధ సెక్షన్ల సూపరింటెండెంట్లు పాల్గొన్నారు.



గణనాథుడి పూజలో పాల్గొన్న కలెక్టర్ లక్ష్మీశ

గణనాథుని అనుగ్రహం ఉండాలి

గణనాథుడికి భక్తిశ్రద్ధలతో నిర్వహించిన పూజలతో సుఖఃసంతోషాలు, ప్రశాంతత, పాడిపంటలతో రాష్ట్రం అభివృద్ధిలో ముందుకు వెళ్లాలని ఎలాంటి విఘ్నాలు లేకుండా రాష్ట్రాభివృద్ధికి విఘ్న నాయకుడి ఆశీస్సులు ఎల్లవేళలా లభించాలని కలెక్టర్ లక్ష్మీశ కోరారు. తాడేపల్లిలోని ఆర్ఎల్ గౌతమి రివర్ బ్రీజ్ అపార్ట్‌మెంట్ రెసిడెంట్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో బుధవారం జరిగిన గణేష్ ఉత్సవ ప్రారంభంలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. విఘ్నేశ్వరుడికి ఎంతో ఇష్టమైన ఉండ్రాళ్లను భక్తితో సమర్పించి పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ రాష్ట్రంలో విద్య, ఉపాధి, వ్యవసాయ, పారిశ్రామిక రంగాల్లో జరుగుతున్న అభివృద్ధి కార్యక్రమాలు నిరాటంకంగా కొనసాగేందుకు విఘ్నాధిపతి అనుగ్రహం మెండుగా ఉండేలా రాష్ట్రవ్యాప్తంగా నవరాత్రి ఉత్సవాలు వైభవంగా నిర్వహిస్తున్నారన్నారు. ఆర్ఎల్ గౌతమి రివర్ బ్రీజ్ అపార్ట్‌మెంట్ కమిటీ గౌరవ సలహాదారు గొట్టుముక్కల రామారావు, అధ్యక్ష, కార్యదర్శులు డీ మధుబాబు, ఏవీ సూర్యనారాయణ, సభ్యులు సుధాకరరావు, సుంకర శ్రీనివాసరావు, జీ మణికుమార్, సీహెచ్ సతీష్, ఉయ్యూరు కోటేశ్వరరావు, కంటే రామ్మోహన్, వీవీ ప్రసాద్, పీ ఉపేంద్ర, ఏవీకే ప్రసాద్ పాల్గొన్నారు.



గన్నవరం టీడీపీ కార్యాలయంలో మాట్లాడుతున్న నాయకులు

వంశీ పిల్లచేష్టలు మానుకోవాలి

● టీడీపీ నేతల హెచ్చరిక

గన్నవరం, ఆగస్టు 28 (ఆంధ్రజ్యోతి): మాజీ ఎమ్మెల్యే వల్లభనేని వంశీ పిల్ల చేష్టలు మానుకోవాలని పలువురు టీడీపీ నేతలు హితవు పలికారు. స్థానిక టీడీపీ కార్యాలయంలో విలేకరులతో గురువారం మాట్లాడారు. ఈ నెల 25న టీడీపీ నేత గూడపాటి దుర్గాప్రసాద్ కేసులో కోర్టు దగ్గరకు వెళ్లారని, అదే సమయానికి మాజీ ఎమ్మెల్యే వంశీ వచ్చి మాటామంతీ కలిపి భుజంపై చేయి వేసి మాట్లాడగా ఆ వీడియోలు, ఫొటోలను వైరల్ చేసి దుర్గా ప్రసాద్‌పై దుష్ప్రచారం చేయటం సరికాదని ఏఎంసీ చైర్మన్ గూడవల్లి నరసింహారావు (నర్సయ్య) అన్నారు. ఎవరైతే వంశీని వ్యతిరేకిస్తారో వాళ్ల వద్దకే వెళ్లి పట్టించుకోపోయినా పదేపదే విష్ చేస్తారన్నారు. అది సరైన పద్ధతి కాదని, ఉద్దేశపూర్వకంగానే టీడీపీ క్యాడర్‌కు బ్యాడ్ మెసేజ్‌ను పంపేలా వంశీ చేస్తాడని ఎవరూ నమ్మవద్దన్నారు. పార్టీ సీనియర్ నేతలు, కార్యకర్తలను టార్గెట్ చేస్తూ ఉంటాడన్నారు. టీడీపీ రాష్ట్ర కార్యదర్శి దొంతు చిన్న మాట్లాడుతూ వంశీ తన మైండ్ గేమ్‌తో టీడీపీలో చిచ్చుపెట్టేందుకు చూస్తున్నాడని, వంశీతో దుర్గాప్రసాద్ మాట్లాడే వీడియోలను తమ పార్టీ వారే ఎమ్మెల్యే, ప్రభుత్వమంటే గిట్టని వారే కావాలని గ్రూపుల్లో వేశారన్నారు. టీడీపీ నేత గూడపాటి దుర్గాప్రసాద్ మాట్లాడుతూ కోర్టు వద్ద యాధృచికంగా జరిగిన ఘటనను ఫొటోలు, వీడియోలు తీసి తానేదో వంశీకి తొత్తుగా ఉన్నానంటూ చేస్తున్న ప్రచారంలో వాస్తవం లేదన్నారు. తనపై అసత్య ప్రచారం చేస్తున్న వారిపై చర్యలు తీసుకోవాలని పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేసినట్టు తెలిపారు. టీడీపీ రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి చిరుమామిళ్ల సూర్యం, తెలుగు మహిళ అధ్యక్షురాలు మేడేపల్లి రమ, ఎంపీటీసీ సభ్యుడు పడమట రంగారావు పాల్గొన్నారు.

ఎడ్లంక పరిరక్షణకు చర్యలు

● ఎడ్లంక దీవి కోతను పరిశీలించిన సెంట్రల్ డిజైన్స్ అధికారులు



ఎడ్లంక దీవి కోత పరిస్థితిని పరిశీలిస్తున్న సీడీఏ అధికారులు

అవనిగడ్డ, ఆగస్టు 28 (ఆంధ్రజ్యోతి): కృష్ణానది వరదల కారణంగా ప్రమాదకరస్థితిలో కోతకు గురవుతున్న ఎడ్లంక దీవిని సెంట్రల్ డిజైన్స్ ఆర్గనైజేషన్ అధికారులు, సెంట్రల్ వాటర్ కమిషన్ అధికారులు గురువారం పరిశీలించారు. ఎడ్లంక దీవి చుట్టూ పదుల సంఖ్యలో ఇళ్లు, వందలాది ఎకరాల పంట భూమి నదీ గర్భంలో కలిసిపోగా, ఈ విషయాన్ని ఎమ్మెల్యే మండలి బుద్ధప్రసాద్, టీడీపీ నేతలు కనపర్తి శ్రీనివాసరావు, బొబ్బా గోవర్ధన్ ముఖ్యమంత్రి చంద్రబాబు, హోం మంత్రి వంగలపూడి అనిత దృష్టికి తీసుకెళ్లారు. ఇప్పటికే ఎడ్లంక దీవి పొడవున దాదాపు 50 మీటర్ల మేర నదీ కోతకు గురైందని, ఇల్లు ఒక్కొక్కటిగా నది గర్భంలో కలిసిపోతోందని కనపర్తి శ్రీనివాసరావు, బొబ్బా గోవర్ధన్ ప్రభుత్వానికి నివేదించగా, సీఎం ఆదేశాలతో గురువారం సెంట్రల్ డిజైన్స్ ఆర్గనైజేషన్ సీఈ విజయభాస్కర్ నేతృత్వంలోని అధికారులు ఎడ్లంక గ్రామాన్ని సందర్శించారు. దీవి చుట్టూ పడవలో తిరిగి నది గర్భంలో ఇల్లు కలిసిపోయిన ప్రాంతాలను పరిశీలించారు. ఐదేళ్లుగా దాదాపుగా 30 శాతం మేర నదిలో కలిసిపోయిందని, ఇలాగే ఉంటే తాము గ్రామంలో జీవించటం కష్టమని గ్రామస్థులు అధికారుల వద్ద వాపోయారు. తహసీల్దార్ కే నాగమల్లేశ్వరరావు, కృష్ణానది వరదల వల్ల గ్రామంలో నెలకొన్న కోత పరిస్థితిని వీడియో తీయించిన దృశ్యాలను సెంట్రల్ టీమ్‌కు చూపించారు. సీఈ విజయభాస్కర్ మాట్లాడుతూ ఎడ్లంక వద్ద కోత సమస్య శాశ్వత పరిష్కారానికి ప్రణాళికలు రూపొందించి ప్రభుత్వానికి పంపిస్తామని, నదీ సముద్రంలో కలిసే ప్రాంతంలో నది తన ప్రవాహ దిశను తరచూ మార్చుకుంటోందని, ఈ క్రమంలో కొత్తగా ఏర్పడిన ఇసుక, మట్టి దిబ్బల కారణంగా దీవిపైకి వేగంగా ప్రవాహం మళ్లటంతో ఈ పరిస్థితి ఏర్పడిందన్నారు. నివారణకు జియోఫ్యూబ్, జియో గ్రెస్ తరహాలో కట్టలు వేసి సమస్యను శాశ్వతంగా పరిష్కరించేలా ప్రణాళికలు రూపొందిస్తామన్నారు. ఎమ్మెల్యే మండలి బుద్ధప్రసాద్ తరపున ఆయన కుమారుడు మండలి వెంకట్రామ్, దివి మార్కెట్ కమిటీ చైర్మన్ కొల్లూరి వెంకటేశ్వరరావు అధికారులతో కలిసి ఎడ్లంక దీవిలో పర్యటించారు. సెంట్రల్ డిజైన్స్ ఎస్ఈ జీ శివకుమార్ రెడ్డి, కృష్ణా డెల్టా సిస్టమ్ సీఈ జీ రాంబాబు, ఇరిగేషన్ ఎస్ఈ ఆర్ రామ్మోహనరావు, కేసీఈ ఈఈ రావెళ్ల రవికిరణ్, ఆర్‌సీ డీఈ సీహెచ్ గోపినాథ్, ఏఈ కట్టా హరీష్, సర్పంచ్ పాలంకి సామ్రాజ్యం పాల్గొన్నారు.

రిక్వెస్ట్ బదిలీలను పరిగణనలోకి తీసుకోండి

● ఆర్టీసీ ఎంప్లాయీస్ యూనియన్ రాష్ట్ర నేతలు

బస్‌స్టేషన్, ఆగస్టు 28 (ఆంధ్రజ్యోతి): ఆర్టీసీ ఉద్యోగుల పదోన్నతుల్లో రిక్వెస్ట్ బదిలీలను పరిగణనలోకి తీసుకొని న్యాయం చేయాలని ఏపీఎస్ఆర్టీసీ ఎంప్లాయీస్ యూనియన్ రాష్ట్ర అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు పలిశెట్టి దామోదరరావు, జీవీ నరసయ్య గురువారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ప్రభుత్వం 2020లో ఆర్టీసీని విలీనం చేసినప్పటి నుంచి సుమారు 3వేల మందికి పైగా ఉద్యోగులకు పదోన్నతులు ఆగిపోయాయని, ముఖ్యమంత్రి, ఉన్నతాధికారులకు వినతి పత్రాలివ్వగా, ముఖ్యమంత్రి స్పందించి పదోన్నతులకు అనుమతి ఇచ్చారన్నారు. పదోన్నతుల్లో ఎన్నో ఏళ్లుగా రిక్వెస్ట్ బదిలీలకు దరఖాస్తు చేసుకున్నవారికి పదోన్నతులు కల్పించాలని ఆర్టీసీ ఎండీ ద్వారకా తిరుమలరావును ఒక ప్రకటనలో కోరారు. పాత పద్ధతిలోనే ఏడీ పీడీ విభాగాల్లో డిప్యూటీ సూపరింటెండెంట్ పదోన్నతులు కల్పించాలని వారు ఆ ప్రకటనలో కోరారు.

రికవరీని నిలిపేయాలి

ప్రభుత్వ ఉద్యోగుల శాలరీ ప్యాకేజీ అగ్రిమెంట్ ప్రకారం ఆర్టీసీ ఉద్యోగులకు రికవరీ అవుతున్న రూ.200 రికవరీని నిలుపుదల చేయాలని ఏపీపీటీడీ, ఎండీలను ఏపీఎస్ఆర్టీసీ నేషనల్ మజ్దూర్ యూనిటీ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షుడు పీ రమణారెడ్డి, ప్రధాన కార్యదర్శి వై శ్రీనివాసరావు గురువారం ఒక ప్రకటనలో కోరారు. గతంలో సంస్థలో పనిచేసే ఉద్యోగులకు స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియాతో శాలరీ ప్యాకేజీ కింద ప్రత్యేక రాయితీలు, ఇన్సూరెన్స్ కవరేజీలు, సిబ్బంది సాధారణ మరణాలకు రూ.200 ప్రతినెలా రికవరీతో అమలు చేయటం జరిగేదన్నారు. ప్రస్తుతం ప్రభుత్వపరంగా ఎస్‌బీఐతో జరిగిన అగ్రిమెంట్ ప్రకారం ఎలాంటి రికవరీ లేకుండా సాధారణ మరణాలకు రూ.10లక్షలు అమలుకు అగ్రిమెంట్ జరిగిందని, ఆర్టీసీ ఉద్యోగులకు అమలు చేసేలా చర్యలు తీసుకోవాలని కోరారు. ఏపీపీటీడీ కమిషనర్, ఎండీలు ప్రత్యేక చొరవ తీసుకుని ఈనెల నుంచి ఆర్టీసీ ఉద్యోగులకు ప్రభుత్వ అగ్రిమెంట్ ప్రకారం రూ.200 రికవరీని నిలుపుదలకు తగు ఉత్తర్వులు ఇవ్వాలని వారు ఆ ప్రకటనలో కోరారు.



అడ్మిషన్ పత్రాలు అందుకుంటున్న విద్యార్థిని

26 నుంచి యూజీ మెడికల్ అడ్మిషన్లు

మాచవరం, ఆగస్టు 28 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర కన్వీనర్ కోటా కింద యూజీ మెడికల్ అడ్మిషన్లు ఈనెల 26 నుంచి 29 వరకు కొనసాగనున్నాయని సిద్ధార్థ మెడికల్ కాలేజీ ప్రిన్సిపాల్ డాక్టర్ ఏ ఏడుకొండలరావు తెలిపారు. మీడియాతో ఆయన మాట్లాడుతూ ఈ అడ్మిషన్లలో మొత్తం 149 మంది విద్యార్థులు విజయవాడలోని కాలేజీలో చేరుతున్నట్టు చెప్పారు. టాప్ ర్యాంక్ సాధించిన విద్యార్థులు మెడికల్ కాలేజీని ఎన్నుకోవడమే మాకు గర్వకారణమన్నారు. కాలేజీలోని మెరుగైన భవనాలు, అత్యాధునిక పరికరాలు, ఆసుపత్రి వసతులు, రోగులపై పనిచేసే అవకాశాలు, క్రీడా వసతులు, అత్యుత్తమ బోధనా తదితర వాటిని ఎంచుకోవాలన్నారు. ఇటీవల విడుదలైన ఐఆర్ఎఫ్ ర్యాంకింగ్స్ ప్రకారం సిద్ధార్థ మెడికల్ కాలేజీ రాష్ట్రంలో 5వ స్థానం, దక్షిణ భారతదేశంలో 15వ స్థానం, ఆలిండియా స్థాయిలో 65వ ర్యాంక్ పొందినట్టు చెప్పారు.



పులిగడ్డ వద్ద ఉధృతంగా ప్రవహిస్తున్న కృష్ణానది

దివిసీమకు వరద

● నదీ పరివాహక ప్రాంత ప్రజల ఆందోళన

అవనిగడ్డ, ఆగస్టు 28 (ఆంధ్రజ్యోతి): ప్రకాశం బ్యారేజీ నుంచి గురువారం సాయంత్రానికి దాదాపు 4.43 లక్షల క్యూసెక్కుల వరద నీరు విడుదల చేయటంతో దివిసీమలో వరద ఉధృతి పెరిగింది. నియోజకవర్గ పరిధిలోని కృష్ణానది పరివాహక ప్రాంతంలోని గ్రామాల ప్రజలు ఆందోళన చెందుతున్నారు. ఘంటసాల మండలం శ్రీకాకుళం మొదలు అవనిగడ్డ మండలం వేకనూరు వరకు, మోపిదేవి మండలం పులిగడ్డ మొదలు పెదకళ్లేపల్లి వరకున్న లంక భూముల్లో ఇప్పటికే పసుపు, మిర్చి, కూరగాయలు, వాణిజ్య పంటలు సాగు చేస్తున్న రైతులు ఆందోళన చెందుతున్నారు.

ఎడ్లంకలో..

అవనిగడ్డ రూరల్: కృష్ణానది వరదనీటి ప్రవాహం మరింత పెరిగే అవకాశం ఉండటంతో ఎడ్లంక గ్రామస్థులు ఆందోళన చెందుతున్నారు. నదిగర్భంలోని పాత ఎడ్లంక గ్రామానికి మరోసారి వరద ముంపు పొంచి ఉందని, అధికారులు, పాలకులు తమ గ్రామాన్ని గట్టెక్కించాలని ప్రజలు కోరుతున్నారు. కృష్ణానది కోత కారణంగా గ్రామంలో మామిడి చెట్లు పడిపోయాయి.

నాగాయలంక: ప్రకాశం బ్యారేజీ నుంచి గురువారం వరద నీరు విడుదల చేయటంతో నాగాయలంక రేవుకి చేరింది. వరద ప్రవాహం నాగాయలంకలోని కృష్ణవేణమ్మ విగ్రహం వద్దకు చేరింది.



మోపిదేవిలో గోడౌన్ వద్ద ఇసుక మూటలు సిద్ధం చేస్తున్న సిబ్బంది

అప్రమత్తమైన అధికారులు

మోపిదేవి: కృష్ణానదికి వరద ప్రవాహం గంట గంటకు పెరుగుతుండటంతో అధికారులు అప్రమత్తమయ్యారు. మండలంలో నదీ తీర గ్రామాలైన బొబ్బర్లంక, కే కొత్తపాలెం, నాగాయితిప్ప, ఉత్తర చిరువోలులంక, కోసూరువారిపాలెం అయోధ్య గ్రామాల వెంబడి ఏఈ హరీష్ తన సిబ్బందితో పర్యటించి బలహీనంగా ఉన్న ప్రదేశాలను గుర్తించారు. వరద ఉధృతి మరింత పెరిగినా ఎలాంటి నష్టం కలుగకుండా నివారించేందుకు ఇసుక మూటలు సిద్ధం చేస్తున్నారు.

కొత్త టీచర్ల ఆనందోత్సాహాలు

మచిలీపట్నం టౌన్, ఆగస్టు 28 (ఆంధ్రజ్యోతి): డీఎస్సీ-2025లో టీచర్లుగా ఎంపికై ఉద్యోగులు కానున్న యువతీ యువకులు ఆనందోత్సాహాలు వ్యక్తం చేశారు. నోబుల్ కళాశాలలో గురువారం సర్టిఫికెట్ల పరిశీలనకు వచ్చిన నూతనంగా ఉపాధ్యాయ వృత్తిలో చేరే యువతను ఆంధ్రజ్యోతి పలుకరించింది. ప్రతి ఒక్కరూ ఆనందంతో కనిపించారు. టీచర్ వృత్తి ఎంతో పవిత్రమైనదని భావించి కొందరు ప్రస్తుతం పనిచేస్తున్న ప్రైవేట్ ఉద్యోగాలు, సచివాలయ కార్యదర్శుల పదవులు వదిలి పెట్టి టీచరు ఉద్యోగంపైనే ఎక్కువ మక్కువ చూపారు.

మా ఇంట్లో ఇద్దరం టీచర్ ఉద్యోగాలు సాధించాం

చీమలపాడు గాయత్రి, తిరువూరు



తిరువూరు నుంచి వచ్చా. నా తల్లిదండ్రులు వ్యవసాయ కూలీలు. నలుగురు అమ్మాయిల్లో 4వ కుమార్తెను. అక్కకు 2014 డీఎస్సీలో వచ్చింది. ఆమెను స్ఫూర్తిగా తీసుకున్నాం. నాలుగేళ్ల నుంచి ప్రిపేర్ అవుతున్నా. ఇప్పుడు నాకు, మా బావగారికి ఉద్యోగాలు వచ్చాయి. పేదరికంలో ఉన్నా కష్టపడి చదివాం. ఆడపిల్లలు కష్టపడితే ఉద్యోగాలు సాధించవచ్చు. చంద్రబాబు అధికారంలోకి వచ్చాక ఉద్యోగాలిచ్చారు. మా ఇంట్లో ఇద్దరం టీచర్లున్నాం.

మాట నెరవేర్చిన చంద్రబాబు

కొట్టే కన్యకా పరమేశ్వరి, మచిలీపట్నం



బయోలాజికల్ సైన్స్‌లో స్కూల్ అసిస్టెంట్‌గా ఉద్యోగం వచ్చింది. మా టీచర్లు సుబ్రహ్మణ్యం మాస్టారు ఇచ్చిన స్ఫూర్తితో ప్రిపేర్ అయ్యా. భర్త, కుటుంబ సభ్యుల ప్రోత్సాహంతో టెక్స్ పుస్తకాలు చదివి ఉద్యోగం సంపాదించగలిగాను. ఈ డీఎస్సీలో ఎక్కువ మంది మహిళలే ఎంపికయ్యారు. మహిళలు తలచుకుంటే సాధించలేనిది లేదు. సీఎం చంద్రబాబు చెప్పింది చేశారు. నాకు ఉద్యోగం దొరికింది.

సచివాలయ కార్యదర్శి ఉద్యోగాన్ని వదిలేశా

జొన్నలగడ్డ వీరవెంకట లక్ష్మీమోహన్, మచిలీపట్నం



టీచర్ ఉద్యోగమంటే నాకెంతో ఇష్టం. ప్రస్తుతం మచిలీపట్నం 43వ డివిజన్‌లో సచివాలయ కార్యదర్శిగా పనిచేస్తున్నా. ఇప్పుడు సచివాలయ ఉద్యోగం వదిలిపెట్టి టీచర్ ఉద్యోగంలో చేరుతున్నా. బాల్యం నుంచి టీచర్ అవ్వాలనే కోరిక నెరవేరింది. ఉద్యోగం పొందినందుకు సంతోషిస్తున్నా.

తండ్రి ఆశయం నేరవేర్చా: గుడిసేవ నాగశ్రీ



నా తండ్రి చనిపోయారు. నేను టీచర్ కావాలనేది ఆయన కోరిక. ఇప్పుడు నేను ఆ కోరిక నెరవేర్చా. నా భర్త వ్యాయామ ఉపాధ్యాయుడిగా పనిచేస్తున్నారు. ఆయన ప్రోత్సాహం, శిక్షణతోనే వ్యాయామ ఉపాధ్యాయురాలిగా ఉద్యోగం సంపాదించా. చిన్నప్పటి నుంచి వ్యాయామం, యోగా చేయడం వల్ల తేలిగ్గా ఎంపిక కాగలిగాను.

రాష్ట్ర ఉత్తమ పాఠశాలగా నున్న

● స్కూల్ ఆఫ్ ఎక్సలెన్స్ అవార్డుకు జిల్లాస్థాయిలో ఐదు పాఠశాలల ఎంపిక

విజయవాడ, ఆగస్టు 28 (ఆంధ్రజ్యోతి): జాతీయ క్రీడా దినోత్సవం సందర్భంగా 2024-25 విద్యా సంవత్సరానికి రాష్ట్ర, జిల్లా స్థాయిలో ఉత్తమ ప్రతిభ కనబరిచిన పాఠశాలలకు స్కూల్ ఆఫ్ ఎక్సలెన్స్ అవార్డులు పాఠశాల విద్యాశాఖ ప్రకటించింది. రాష్ట్ర స్థాయిలో నున్న జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల 1347 పాయింట్లతో ప్రథమ స్థానం సాధించడంతో జిల్లా విద్యాశాఖాధికారి యూవీ సుబ్బారావు ఆనందం వ్యక్తం చేశారు. జిల్లాలోని నున్న ప్రథమ స్థానంలో ఉండగా, పటమటలోని కేబీసీ జిల్లా బాలుర ఉన్నతపాఠశాల ద్వితీయ స్థానంలో నిలిచింది. దుర్గాపురంలోని ఎస్‌టీవీఆర్ మున్సిపల్ ఉన్నత పాఠశాల తృతయస్థానం సాధించగా, నిడమానూరు జిల్లా పరిషత్ పాఠశాల 4వ స్థానం, కొత్తపేట ఎస్‌కేపీవీవీ హిందూ ఉన్నత పాఠశాల ఐదో స్థానంలో నిలిచింది. ఈ విజయాలు జిల్లాకు ప్రతిష్ఠ తీసుకువచ్చాయని, విద్యార్థులను క్రీడా ప్రతిభావంతులుగా తీర్చిదిద్దిన ప్రధానోపాధ్యాయులు, వ్యాయామ ఉపాధ్యాయులును డీఈవో అభినందించారు.

బ్రాయిలర్ ధరలు



అమరావతి	(రూ.లలో)
బ్రాయిలర్ బర్డ్	112, 121, 132
చికెన్ విత్ స్కిన్	214
చికెన్ స్కిన్‌లెస్	224

నెక్ కోడిగుడ్డు ధర (100)

విజయవాడ జోన్ రైతు ధర రూ. 560

చేపల చెరువు వేలం పాట వాయిదా

గుడివాడ రూరల్, ఆగస్టు 28 (ఆంధ్రజ్యోతి): మోటూరులో 8 చేపల చెరువులకు గురువారం పంచాయతీ కార్యాలయం వద్ద కార్యదర్శి జగన్నాథ రావు ఆధ్వర్యంలో వేలం పాట నిర్వహించగా, ఎవరు సరిగా రాకపోవటంతో వాయిదా వేశారు. పాటకు వచ్చిన వారు పూచీకత్తులపై బ్యాంక్ గ్యారెంటీ తీసుకోకపోవడంతో వాయిదా వేశారు. మరలా తేదీ ప్రకటిస్తామని తెలిపారు. ఈ సారి పాటకు వచ్చే వారు బ్యాంక్ పూచీకత్తు, తహసీల్దార్ కార్యాలయం నుంచి ఆర్థికంగా స్థితిమంతులుగా ఉన్నట్లు సర్టిఫికెట్ తీసుకోవాలన్నారు. ఉపసర్పంచ్ ఇమ్మడి నరసింహారావు, తదితరులు పాల్గొన్నారు.



చేపల చెరువు వేలం పాట నిర్వహిస్తున్న జగన్నాథరావు

ఏఎన్ఆర్‌లో మెగా జాబ్‌మేళా 30న

గుడివాడ, ఆగస్టు 28(ఆంధ్రజ్యోతి) : గుడివాడలోని అక్కినేని నాగేశ్వరరావు కళాశాలలో ఈ నెల 30వ తేదీన మెగా జాబ్‌మేళాను నిర్వహిస్తున్నట్లు కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ పి.జె.ఎస్ కుమార్ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. రాష్ట్ర నైపుణ్యాభివృద్ధి సంస్థ, జిల్లా ఉపాధి కల్పన శాఖల సంయుక్త ఆధ్వర్యంలో యువతకు ఉద్యోగ అవకాశాలను కల్పించేందుకు జాబ్ మేళా నిర్వహిస్తున్నట్లు తెలిపారు. నిరుద్యోగులు ఈ అవకాశాన్ని వినియోగించుకోవాలని ప్రిన్సిపాల్ ప్రకటనలో తెలిపారు.



మధ్యాహ్న భోజనాన్ని పరిశీలిస్తున్న ఎంఈవో రజని

నాణ్యమైన భోజనాన్ని అందజేయాలి

● ఎంఈవో రజని

గుడివాడ రూరల్, ఆగస్టు 28 (ఆంధ్రజ్యోతి): విద్యార్థులకు నాణ్యమైన భోజనాన్ని అందజేయాలని ఎంఈవో రజని పాఠశాల అధికారులకు సూచించారు. గుడివాడ రూరల్ పరిధిలో స్లేటర్ పేట పాఠశాలను సందర్శించి, మధ్యాహ్న భోజన పథకాన్ని పరిశీలించారు. కొన్ని చోట్ల ఇబ్బందులు ఉన్నాయని, వాటిని సరి చేసేందుకు కృషి చేస్తామన్నారు.

చట్టాలపై అవగాహన తప్పనిసరి

గుడివాడ రూరల్: పిల్లలకు బాల్య వివాహాలు చేయటం వల్ల చాలా అనర్థాలు జరుగుతున్నాయని ప్యానల్ లాయర్ బి.విమలాదేవి అన్నారు. గురువారం రామన్నపూడిలో మండల న్యాయసేవాధికార సంస్థ ఆధ్వర్యంలో బాల్య వివాహాలు, పోక్సో చట్టం తదితర చట్టాలపై అవగాహన సదస్సు జరిగింది. సర్పంచ్ మీగడ మురళీధర్, జనసేన పార్టీ అధ్యక్షులు ఇంటేటి గజేంద్ర, కార్యదర్శి రామ్మోహనరావు, రామన్నపూడి గ్రామస్థులు పాల్గొన్నారు.

గ్రామాల అభివృద్ధికి అధికారులు సహకరించాలి

● ఎమ్మెల్యే వెనిగండ్ల రాము

గుడివాడ, ఆగస్టు 28(ఆంధ్రజ్యోతి) : గ్రామాల సమగ్ర అభివృద్ధికి అధికార యంత్రాంగం సమన్వయంతో పనిచేయాలని ఎమ్మెల్యే వెనిగండ్ల రాము అన్నారు. గురువారం స్థానిక ప్రజావేదికలో మండల పరిషత్, పంచాయతీ రాజ్ అధికారులతో సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఉపాధి హామీ, జిల్లా పరిషత్ నిధులతో గ్రామాల్లో అభివృద్ధి పనులు లక్ష్యాలకు అనుగుణంగా సాగుతున్నాయన్నారు. ప్రజాసమస్యల పరిష్కరించడంలో గ్రామాల వారీగా అభివృద్ధి పనుల అంచనాలను రూపొందించి వాటి పరిష్కారానికి కృషి చేస్తామన్నారు. కూటమి ప్రభుత్వంలో అర్హులందరికి పింఛన్ అందుతుందని, ఆందోళన చెందాల్సిన అవసరం లేదన్నారు. పింఛన్ల రీవెరిఫికేషన్ పారదర్శకంగా నిర్వహించేలా అధికారులకు స్పష్టమైన సూచనలు చేశామన్నారు. గ్రామాల్లో సమస్యలుంటే ప్రజావేదిక దృష్టికి తీసుకువస్తే పరిష్కారానికి చర్యలు తీసుకుంటానని ఎమ్మెల్యే వెనిగండ్ల హామీ ఇచ్చారు. ఈ సమావేశంలో ఎంపీడీవోలు మల్లీశ్వరీ, విష్ణుప్రసాద్, ఇన్‌చార్జ్ మహ్మమద్ ఇమ్రాన్, పంచాయితీరాజ్ డీఈ రవి, ఏఈలు సూరిబాబు, నాగేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

గుడివాడ : రాష్ట్రంలో మెగా డీఎస్సీ ద్వారా ఉపాధ్యాయుల పోస్టుల భర్తీ చేపట్టడం హర్షణీయమని ఎమ్మెల్యే వెనిగండ్ల రాము అన్నారు. గురువారం స్థానిక ప్రజావేదికలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ అవగాహన రాహిత్యంతో గత వైసీపీ ప్రభుత్వంలో రాష్ట్రంలో జరిగిన వినాశనం మరువలేనిదని, అవగాహనతో కూడిన పాలన చేస్తే అంతా మంచే జరుగుతుందని కూటమి ప్రభుత్వం నిరూపించిందన్నారు. ఏడాది వ్యవధిలోనే డీఎస్సీ ద్వారా 16,437 ఉపాధ్యాయ పోస్టులను భర్తీ చేస్తూ కూటమి ప్రభుత్వం నిబద్ధతను చాటుకుందన్నారు. ప్రభుత్వ పాఠశాల్లో ప్రతి చిన్న విషయానికి ప్రాముఖ్యనిస్తూ, విద్యాభివృద్ధికి లోకేశ్ తీసుకుంటున్న చర్యలు సత్ఫలితాలను ఇస్తున్నాయన్నారు. గత వైసీపీ ప్రభుత్వం తరహాలో ఫోటోల పిచ్చితో కాకుండా ప్రతిఒక్కరికీ మంచి చేయడమే లక్ష్యంగా కూటమి ప్రభుత్వం పనిచేస్తుందని ఎమ్మెల్యే వెనిగండ్ల రాము పేర్కొన్నారు.



సమీక్షా సమావేశంలో అధికారులతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే వెనిగండ్ల



చెరకుసాగులో మెళకువలను వివరిస్తున్న సుధారాణి

పాలుసు పురుగుల నివారణే ధ్యేయం

● కేవీకే సమన్వయకర్త సుధారాణి

తోట్లవల్లూరు, ఆగస్టు 28 (ఆంధ్రజ్యోతి) : చెరకులో పీక పురుగు, పొలుసు పురుగుల నివారణ చేపట్టకపోతే పంట నష్టం కలుగుతుందని ఘంటసాల కృషి విజ్ఞాన కేంద్రం సమన్వయకర్త డాక్టర్ డి. సుధారాణి తెలిపారు. మండలంలోని భద్రిరాజుపాలెంలో గురువారం చెరకులో సమగ్ర పురుగుల యాజమాన్యం కార్యక్రమం నిర్వహించారు. అధిక వర్షాలకు ముంపనకు గురైన చెరకు తోటకు వడలు తెగులు కూడా ఆశిస్తుందన్నారు. ముదుగుని బయటకు తీసి కాపర్ ఆక్సీక్లోరైడ్ లేదా బ్లూ కాపర్ 3.0 గ్రాములు చొప్పున లీటరు నీటికి కలిపి తోటకు నీరు పెడితే పురుగులు నివారణ అవుతాయని సుధారాణి రైతులకు వివరించారు. శాస్త్రవేత్త డాక్టర్ రేవతి తదితరులు పాల్గొన్నారు.

చెరువులను తలపిస్తున్న రహదారులు



జలమయంగా మారిన కూచిపూడి ప్రధాన రహదారి

కూచిపూడి, ఆగస్టు 28 (ఆంధ్రజ్యోతి): అల్పపీడనం ప్రభావం కారణంగా మంగళవారం రాత్రి నుంచి కురుస్తున్న వర్షాలకు కూచిపూడి సెంటర్‌లోని ప్రధాన రహదారులు చెరువులను తలపిస్తున్నాయి. పెదపూడి - కూచిపూడి, బార్లపూడి రహదారులు, కూచిపూడి బస్టాండ్ ప్రాంతం జలమయం అయ్యాయి. డ్రెయినేజీ వ్యవస్థ సక్రమంగా లేకపోవటంతో తరచూ కూచిపూడిలో ఇలాంటి పరిస్థితులు ఏర్పడుతున్నాయి. మొవ్వ బస్టాండ్ ప్రాంతం, సంత బజారు, కళాశాల రహదారులు జలమయంకావటంతో జలజీవనం స్థంభించింది.

గుడ్లవల్లేరు : గుడ్లవల్లేరు- అడ్డాడ ప్రధాన రహదారి గుంతల మయమై గత రెండు రోజులుగా కురుస్తున్న వర్షాలకు రహదారి చెరువుగా మారింది. ద్విచక్ర వాహన చోదకులకు గుంతలు ఎంత లోతుగా ఉన్నవీ తెలియక ఆ గుంతల్లో పడే ప్రమాదం ఉంది. పెంజంద్ర రేమల్లెగూడెం దళితవాడ వద్ద పెద్దపెద్ద గుంతలు ఏర్పడటంతో గ్రామానికి చెందిన సామాజిక వేత్త ఈశ్వర్ జోరువానలో సైతం ఇద్దరు మనుషులతో రోడ్డుపై నిలచిన నీటిని దారి మళ్లింపచేశారు.



పెంజంద్ర దళిత వాడ వద్ద చెరువును తలపిస్తున్న రహదారి

వైద్య శిబిరాలను సద్వినియోగం చేసుకోవాలి

● డాక్టర్ సాయిప్రసాద్

పామర్రు, ఆగస్టు28 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ సంక్షేమ వసతిగృహాల్లో విద్యార్థులు చదువుతోపాటు వారి ఆరోగ్యపట్ల శ్రద్ధ వహిస్తూ దాతలు,సచ్చంద సంస్థలు అందించే ఉచిత వైద్యశిబిరాలను సద్వినియోగం చేసుకోవాలని సత్యసాయి సేవాసంస్థ వైద్యవిభాగ జిల్లా కోఆర్డినేటర్ డాక్టర్ సాయిప్రసాద్ అన్నారు. మండల పరిధిలోని నిమ్మకూరు ఏపీఆర్‌జేసీ కళాశాలలో గురువారం పూర్వవిద్యార్థులు, సత్యసాయి సేవా సంస్థల ఆధ్వర్యంలో విద్యార్థులకు మూడురోజుల పాటు నిర్వహించే చర్మవ్యాధుల నివారణ కోసం ఉచిత వైద్యశిబిరాన్ని ప్రారంభించారు. ప్రిన్సిపాల్ ఎస్.లక్ష్మికుమారి అధ్యక్షతన నిర్వహించారు. పోషకాహారం తీసుకోవడం వల్ల కలిగే ఆరోగ్య ప్రయోజనాలను వివరించారు. కార్యక్రమంలో చర్మవ్యాధుల నిపుణులు కోసూరి ఫణికుమార్, విశ్రాంత ఎంఈవో వెంకటేశ్వరరావు, కె.శివప్రసాద్, వరప్రసాద్, శైలజ, కె.నాగమణి రాజ్యలక్ష్మి, సోమేశ్వరి తదితరులు పాల్గొన్నారు.



వైద్య శిబిరంలో మాట్లాడుతున్న డాక్టర్ సాయిప్రసాద్

గుడివాడ : స్థానిక ఏలూరురోడ్డులోని ఫాదర్ బియాంకి బాలికల ఉన్నత పాఠశాలలో లయన్స్ క్లబ్ ఆఫ్ గుడివాడ ప్రగతి ఆధ్వర్యంలో గురువారం విద్యార్థులకు నేత్ర వైద్య పరీక్షలను నిర్వహించారు. ఉయ్యూరు రోటరీ ఐ సెంటర్ వైద్యులు విద్యార్థినులకు పరీక్షలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో క్లబ్ అధ్యక్షుడు మాదాల సురేష్, కార్యదర్శి కేశవరావు, కోశాధికారి రవికుమార్, సభ్యులు సుబ్బారావు, రాంబాబుపాల్గొన్నారు.

ఘనంగా 'నేనే ధైర్యం' ట్రైలర్ విడుదల

గుడివాడ, ఆగస్టు 28(ఆంధ్రజ్యోతి) : క్షుద్రశక్తులను నమ్ముకుంటే జీవితాలు నాశనమవుతాయని, సాయిబాబాను నమ్ముకున్న వారికి అంతా మంచే జరుగుతుందని నేపథ్యంలో నిర్మించిన "నేనే ధైర్యం" చిత్రం విజయవంతం అవ్వాలని ఎన్టీఆర్ స్టేడియం కమిటీ ఉపాధ్యక్షుడు యలవర్తి శ్రీనివాసరావు, అర్బన్ బ్యాంకు మాజీచైర్మన్ పిన్నమనేని బాబ్జీలు ఆకాంక్షించారు. గురువారం స్థానిక విఘ్నేశ్వరస్వామి వారి దేవస్థానంలో సినిమా ట్రైలర్‌ను విడుదల చేశారు. అనంతరం వారు మాట్లాడుతూ ఆర్.కె క్రియేషన్స్ పతాకంపై నిర్మించిన "నేనే ధైర్యం" చిత్రం కథ, చిత్రానువాదం, మాటలు, డీవోపీ, నిర్మాత, దర్శకుడు రాము కత్తుల గుడివాడ పరిసర ప్రాంతాలో ప్రాంతీయ కళాకారులతో చిత్రాన్ని రూపొందించడం అభినందనీయమన్నారు. ముఖ్యంగా పెదపారుపూడి సాయిబాబా ఆలయం, భూషణగుళ్ల, ఈదులమద్దాలి గ్రామాల్లో చిత్రాన్ని చిత్రీకిరంచారన్నారు. చిత్రం నటీనటులకు అభినందనలు తెలిపారు. ఈ చిత్రంలో సాయిబాబాగా అజయ్ నారగాని, నానాజీగా మోర్ల కామేష్ గౌడ్, క్షుద్ర మాంత్రికుడుగా రమేష్, బాబా భక్తులుగా మల్లిపూడి చక్రవర్తి, బాలాజీలు, దయ్యాలుగా లక్ష్మీ, ధనవం శ్రీదేవి, బాజీ, గోగం రామారావు, సాయిబాబా ఆలయ పూజారిగా వెంకటేశ్వరరావులు నటించారు. ఈ కార్యక్రమంలో దేవస్థాన ధర్మకర్తల కమిటీ చైర్మన్ సాయన రాజేష్, పట్టణ ప్రముఖులు సాయన గాంధీ, వంశీ, సమ్మెట సూర్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.



ట్రైలర్‌ను విడుదల చేస్తున్న యలవర్తి, పిన్నమనేని

ఆలయాల హుండీ లెక్కింపు

పామర్రు, ఆగస్టు28 (ఆంధ్రజ్యోతి): ఉండ్రపూడి-పోలవరం అడ్డరోడ్డు వద్ద గల వీరాంజనేయ స్వామి దేవస్థానం హుండీ లెక్కింపు గురువారం ఆలయ ప్రాంగణంలో నిర్వహించారు. మొత్తం 91 రోజులకు గాను రూ.6,69,702లు ఆదాయం వచ్చినట్టు ఆలయ పర్యవేక్షణాధికారి ఎస్వీ సుబ్బారావు తెలిపారు. ఈ లెక్కింపులో ఉండ్రపూడి, పోలవరం గ్రామాలకు చెందిన టీడీపీ , జనసేన నేతలు దాడి పవన్, ఎంపీటీసీ సభ్యులు కూనపరెడ్డి సుబ్బారావు, మాజీ సర్పంచ్ మట్టా వేంకటేశ్వరరావు, వెన్నా శ్రీనివాసరావు, గంటయ్య, ఆలయ అధికారి ప్రసాద్‌రావు,పాల్గొన్నారు.

పమిడిముక్కల : మంటాడలో అలివేలుమంగా పద్మావతి సమేత వైకుంఠ వేంకటేశ్వరస్వామి హుండీ ఆదాయం రూ. 6,07,001 లభించినట్టు దేవాదాయ ,ధర్మాదయ శాఖ గన్నవరం తనిఖీ దారు అనురాధ తెలిపారు. ఆలయంలో తొమ్మిది హుండీలలో భక్తులు సమర్పించిన కానుకలు లెక్కించగా 89 రోజులకు గాను నోట్ల ద్వారా రూ.5,54,760, చిల్లరనాణేల ద్వా రా రూ.52,241 రాగా మిశ్రమ బంగారం 000.62-500 మిల్లీ గ్రాములు, మిశ్రమ వెండి 000.165-500 మిల్లీగ్రాములు వచ్చినట్లు తెలిపారు. లెక్కింపు కార్యక్రమంలో లయ వ్యవస్థాపక కుటుంబ సభ్యులు అగస్త్యరాజు రామమోహన్‌రావు, ఆలయ కార్యనిర్వహణాధికారి దుర్గానాగేశ్వర రావు, సేవా సంఘం సభ్యులు పాల్గొన్నారు.



హుండీల లెక్కింపులో పాల్గొన్న అధికారులు

మద్యం మత్తులో యువకుల వీరంగం

తోట్లవల్లూరు, ఆగస్టు 28 (ఆంధ్రజ్యోతి) : యాకమూరులో బుధవారం రాత్రి నలుగురు మందుబాబులు ఓ కుటుంబంపై తీవ్రంగా దాడికి పాల్పడ్డారు. ఉప్పు గోపి(27) బుధవారం రాత్రి 9.30 గంటల సమయంలో పాలు తీసుకుని ఇంటికి వస్తున్నాడు. మద్యం మత్తులో ఉన్న నలుగురు వ్యక్తులు గోపీని చూసి ఆపి ఎక్కడి నుంచి వస్తున్నావని ప్రశ్నించగా పిల్లలకు పాలు తీసుకెళుతున్నానని చెప్పగా ఆ మందుబాబులు పైశాచికంగా గోపీపై దాడికి పాల్పడ్డారు. గోపీని, భార్యను, అత్తను, అతని అక్క భవానీనిపై కూడా విచక్షణారహితంగా దాడికి పాల్పడ్డారని, భవాని నైటీ చించివేశారని ఎస్సై సీహెచ్ అవినాష్ తెలిపారు. గోపీని చికిత్స నిమిత్తం ఉయ్యూరు ప్రభుత్వాస్పత్రికి తరలించామన్నారు. గోపీ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని ఎస్సై తెలిపారు.

వెన్ననపూడి మాజీ సర్పంచ్ మృతి



సురేంద్ర

నందివాడ, ఆగస్టు 28 (ఆంధ్రజ్యోతి): వెన్ననపూడి గ్రామ మాజీ సర్పంచ్ లింగం సురేంద్ర (85) అనారోగ్యంతో తన స్వగృహంలో బుధవారం తుదిశ్వాస విడిచినట్లు కుమారుడు లింగం సుందరరావు తెలిపారు. లింగం సురేంద్ర రాజకీయ ఉద్దండుడు. గ్రామసర్పంచ్‌గా 25 సంవత్సరాలు, కో-ఆపరేటివ్ బ్యాంక్ ఛైర్మన్‌గా ఏడు సంవత్సరాలుగా గ్రామస్థులకు సేవలందిస్తున్నారు. ఆయనకు ఇద్దరు కుమారులు, ఒక కుమార్తె ఉన్నారు. గురువారం సురేంద్ర కుటుంబసభ్యులను పరామర్శించేందుకు చేకూరి నరసింహారావు, గుడివాడ మార్కెట్ యార్డు ఛైర్మన్ చాట్రగడ్డ రవి, మండల టీడీపీ నాయకులు, వైసీపీ నాయకులు, కార్యకర్తలు, గ్రామస్థులు వచ్చారు.

ఆదరణ తగ్గని బాలనాగమ్మ నాటకం

గుడివాడ, ఆగస్టు 28(ఆంధ్రజ్యోతి) : అంతరించిపోతున్న జానపద పద్య నాటకాన్ని రాష్ట్ర ప్రభుత్వం మళ్లీ జీవం పోస్తుందని, బాలనాగమ్మ లాంటి నాటికలను ఆదరించాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందని కూటమి నాయకులు పేర్కొన్నారు. బుధవారం రాత్రి స్థానిక వాసవీ కన్యకాపరమేశ్వరీ అమ్మవారి దేవస్థాన కళా ప్రాంగణంలో రాష్ట్ర సృజనాత్మకత, సంస్కృతి సమితి, విజయవాడ వారి సౌజన్యంతో రాజరాజేశ్వరీ నాట్యమండలి గుడివాడ వారిచే బి.నాగలక్ష్మీ ఆధ్వర్యంలో బాలనాగమ్మ పద్యనాటకం ప్రదర్శించారు. ఈ నాటకంలో వివిధ పాత్రధారులుగా బి.నాగలక్ష్మీ, బి.విజయరాణి, ఎస్.కోటేశ్వరీ, లోయ రాధాకృష్ణ, బి.శ్రీనివాస్ నాయుడు, అప్పారావు, ఈగ నాగేశ్వరరావు, బి.రాణి, పులి నాగేశ్వరరావు తదితరుల ప్రదర్శన ఆకట్టుకుంది.



దొండపాడు పంట కాలువపైనే గుట్టలుగా పోసిన చెత్తాచెదారాలు

చెత్త వ్యర్థాలను తొలగించాలి

గుడివాడ రూరల్ : దొండపాడు వెళ్లే ప్రధాన రహదారి పక్కన శ్రీకాళహస్తీ కాలనీ వాసులు వ్యర్థాలను, చెత్తాచెదారాన్ని దొండపాడు పంటకాలువల పక్కనే పోస్తున్నారు. కోళ్ల వ్యర్థాలు, లెట్రిన్ వ్యర్థాలు, గృహాల్లో వాడిన ప్లాస్టిక్ తదితర వ్యర్థాలు తీసుకొచ్చి పంట కాలువ పక్కన డంపింగ్ చేస్తున్నారు. రెండు, మూడు రోజులకు నిల్వ ఉండటంతో అవి కాలువలోకి వెళ్లి తాగునీరు పాడవుతుందని, దొండపాడు, చిలకమూడి, మోటూరు, సెరిగొల్వేపల్లి తదితర గ్రామాల ప్రజలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ఎంపీడీవో విష్ణుప్రసాద్‌ను వివరణ కోరగా దొండపాడు పంట కాలువ పక్కన ఉన్న శ్రీకాళహస్తీ కాలనీలో గత నాలుగు రోజులు క్రితం నాలుగు ట్రాక్టర్ల వ్యర్థాలు ఎత్తించి బయట పారబోసినట్లు తెలిపారు.

బషీర్‌బాగ్ మృతులకు నివాళి

గుడివాడ, ఆగస్టు 28(ఆంధ్రజ్యోతి) : బషీర్‌బాగ్ విద్యుత్ అమరవీరుల స్ఫూర్తితో స్మార్ట్‌మీటర్లు, ట్రూ అప్ ఛార్జీలపై ప్రజలు ఐక్యంగా పోరాడి విద్యుత్ చార్జీల తగ్గించుకోవాలని సీపీఎం సీనియర్ నాయకులు నీలం మురళీకృష్ణారెడ్డి పిలుపునిచ్చారు. గురువారం స్థానిక సుందరయ్య భవన్‌లో పోలీసుకాల్పుల్లో మృతి చెందిన విష్ణువర్ధన్‌రెడ్డి, రామకృష్ణ, బాలస్వామిల చిత్రపటాలకు నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యుత్ చార్జీలకు వ్యతిరేకంగా బషీర్‌బాగ్‌లో జరిగిన ప్రదర్శనలో పోలీస్ కాల్పుల్లో అమరులైన ముగ్గురి స్ఫూర్తితో స్మార్ట్‌మీటర్లకు వ్యతిరేకంగా పోరాటాలు చేయాలని పిలుపునిచ్చారు. ప్రజలంతా ఐక్యంగా ఉద్యమిస్తేనే విద్యుత్ భారాలు తగ్గించుకోవడం సాధ్యపడుతుందన్నారు. ఈ కార్యక్రమంలో సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షుడు ఆర్‌సీపీ రెడ్డి, సీపీఐ ఏరియా కార్యదర్శి గూడపాటి ప్రకాష్ బాబు, సీపీఐ(ఎం)డివిజన్ కార్యదర్శి కొమ్ముల సురేష్, వామపక్ష నాయకులు సీహెచ్ సత్యనారాయణ, సురేంద్ర, రజిని, ఎస్ఎఫ్ఐ నాయకులు సమరం, కేవీపీఎస్ నాయకులు ఎస్.రాంబాబు, పాల్గొన్నారు.



బషీర్‌బాగ్ మృతులకు నివాళులర్పిస్తున్న వామపక్ష నాయకులు

సిగరెట్ కాల్చాడని ఒకరిపై దాడి

గుడివాడ : స్థానిక కార్మికనగర్‌కు చెందిన మీసాల లక్ష్మణరావు చర్చి వద్ద సిగరెట్ కాలుస్తుండగా, స్థానిక యువకులు వచ్చి వారించారు. తాను కాలుస్తానని తేల్చి చెప్పడంతో యువకులు దాడి చేసి చేతులు, కాళ్లతో కొట్టారు. బాధితుడిని స్థానిక ప్రాంతీయ ప్రభుత్వాసుపత్రికి తరలించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు వన్‌టౌన్ ఎస్సై పి.గౌతమ్‌కుమార్ తెలిపారు.

వాటర్‌కూలర్ వితరణ

పమిడిముక్కల : మంటాడలో అలివేలు మంగ, పద్మావతి సమేత వైకుంఠ వేంకటేశ్వరస్వామి, శ్రీదేవి, భూదేవి సమేత కల్యాణ వేంకటేశ్వరస్వామి ఆలయాలకుఇండియన్‌బ్యాంకు ఉయ్యూరు బ్రాంచి వాటర్‌కూలర్ బహూకరించారు. ఆలయ వంశపారంపర్య ధర్మకర్త రామమోహనరావు, కార్యనిర్వహణ అధికారి హరిదుర్గా నాగేశ్వరరావు పాల్గొన్నారు.

భక్తిశ్రద్ధలతో వినాయక చవితి వేడుకలు




కూచిపూడిలో..

గుడివాడ, ఆగస్టు 28(ఆంధ్రజ్యోతి) : స్థానిక మెయిన్‌రోడ్డులో వేంచేసియున్న విఘ్నేశ్వరస్వామి దేవస్థానంలో ఘనంగా నిర్వహిస్తున్న గణపతి నవ రాత్రి మహోత్సవాలను ఘనంగా నిర్వహిస్తున్నారు. రెండో రోజు స్వామి వారు మహాగణపతి అలంకారంలో భక్తులకు దర్శనమిచ్చారు. ఈ కార్యక్రమంలో దేవస్థాన కార్యనిర్వహణాధికారి యార్లగడ్డ శ్రీనివాస రావు(వాసు) ధర్మకర్తల కమిటీ చైర్మన్ సాయన రాజేష్, సభ్యులు లోయ వాసు, పాల్గొన్నారు.

కూచిపూడి: మండల పరిధిలోని 21 గ్రామపంచాయతీల్లో ప్రత్యేకంగా అలంకరించిన పందిళ్లలో 100కు పైగా వినాయకవిగ్రహాలుప్రతిష్ఠించి పూజలు చేశారు.

గుడ్లవల్లేరు : కౌతవరం విఘ్నేశ్వరాలయం, గుడ్లవల్లేరు గౌడసంఘం వినాయకుని ఆలయం, అంగలూరు గణపతి మందిరాలలో పూజలు, చేశారు.



పామర్రులో..

గుడివాడ రూరల్: బొమ్ములూరు, చౌటపల్లి తదితర గ్రామాల్లో గణనాథుని విగ్రహాలను భారీ ఎత్తున మండపాలు కట్టి ప్రత్యేక పూజలు చేశారు. గణేశ్ మండపాల వద్ద బందోబస్తును ఏర్పాటు చేస్తున్నట్లు ఎస్సై చంటిబాబు తెలిపారు.

పెదపారుపూడి: పెదపారుపూడి, వెంట్రప్రగడ, యలమర్రు, దోసపాడు, భూషణగుళ్ల, చిన్నపారుపూడి, ఈదులమద్దాలి తదితర గ్రామాల్లో వినాయక ప్రతిమలకు పూజలు ఘనంగా నిర్వహించారు. తాతినేని ప్రసాద్, ఏకమూరి వెంకటేశ్వరరావు, దొండపాటి యశ్వంత్, షేక్ అజిత్ పాల్గొన్నారు.

పామర్రు : స్థానిక ఆంధ్రాబ్యాంకు బజారు, కోటిరెడ్డిపేట, అరండల్‌పేట, వెలమపేట, కుమ్మరిపేట, గౌడపేట, చౌదరిపేట, నాయుడుపేట, రెడ్లకాలనీలోని ఆలయాల్లో వినాయక చవితి వేడుకలు ఘనంగా నిర్వహించారు. నిమ్మకూరు ఏపీఆర్‌జేసీ కళాశాలలో ప్రిన్సిపాల్ లక్ష్మీకుమారి ఆధ్వర్యంలో గణేశ్ ఉత్సవాలు నిర్వహించారు. ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు చోటుచేసుకోకుండా సీఐ సుభాకర్ పర్యవేక్షించారు.


నందివాడ: పోలుకొండ, తమిరిశ, రుద్రపాక, లక్ష్మీనరసింహాపురం, కుదరవల్లి, తుమ్మలపల్లి, నందివాడ, జనార్ధనపురం, పుట్టగుంట గ్రామాలలో వినాయకుడికి చలువ పందిళ్లు ఏర్పాటు చేసి పూజా కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్టు ఆలయ కమిటీ సభ్యులు తెలిపారు. భక్తులకు ప్రసాదాలు అందజేశారు.



గుడివాడ రూరల్‌లో..

పమిడిముక్కల : గ్రామాల్లోని కూడళ్లు, కాలనీలలో చవితి మండపాలు ఏర్పాటుచేసి వివిధ ఆకృతులలో ఉన్న గణేశ్ విగ్రహాలుంచి పూజలు చేశారు. శుక్రవారం సాయంత్రం అన్న సమారాధన చేస్తున్నట్టు నిర్వాహకులు తెలిపారు.

తోట్లవల్లూరు : తోట్లవల్లూరులో అన్ని గ్రామాల్లో ప్రత్యేక పందిళ్లువేసి అందమైన గణనాథుల విగ్రహాలను పెట్టి ఉత్సాహంగా వేడుకలు నిర్వహించారు. స్వామివారికి భక్తులు నైవేద్యాలు సమర్పించారు. గురువారం రొయ్యూరు తదితర గ్రామాల్లో గణేశ్ విగ్రహాల నిమజ్జనం జరిగింది.



పమిడిముక్కలలో..

బ్రాయిలర్ ధరలు

అమరావతి	(రూ.లలో)
బ్రాయిలర్ బర్డ్	112, 121, 132
చికెన్ విత్ స్కిన్	214
చికెన్ స్కిన్‌లెస్	224

నెక్ కోడిగుడ్డు ధర (100)
విజయవాడ జోన్ రైతు ధర రూ. 560



క్వాంటమ్ వ్యాలీతో పుష్కలంగా ఉపాధి : వీసీ

మచిలీపట్నం టౌన్, ఆగస్టు 28 (ఆంధ్రజ్యోతి) : ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా ఏర్పాటు చేసే క్వాంటమ్ వ్యాలీతో పెద్ద ఎత్తున ఉపాధి అవకాశాలు లభిస్తాయని కేయు వీసీ కూన రాంజీ అన్నారు. వర్సిటీ ఇంజనీరింగ్ కళాశాలలో నిర్వహించిన హ్యాకథాన్‌లో ఆయన మాట్లాడారు. అమరావతికి అత్యంత సమీపంలో కృష్ణా విశ్వవిద్యాలయం ఉండటం శుభపరిణామమన్నారు. సుందరకృష్ణ తదితరులు పాల్గొన్నారు.



కప్పలదొడ్డిలో గణేష్ ఉత్సవ కమిటీ నాయకులతో మాట్లాడుతున్న ఎస్పీ గంగాధరరావు

ఉత్సవ కమిటీలు నిబంధనలు పాటించాలి

నిమజ్జన సమయంలో జాగ్రతలు తీసుకోవాలి : ఎస్పీ గంగాధరరావు

పెడన, ఆగస్టు 28 (ఆంధ్రజ్యోతి) : గణేష్ ఉత్సవ కమిటీలు నిబంధనలు పాటిస్తూ, ప్రశాంతంగా నవరాత్రులు జరుపుకోవాలని, నిమజ్జన సమయంలో అప్రమత్తంగా ఉండాలని ఎస్పీ ఆర్. గంగాధరరావు సూచించారు. పెడన పట్టణంలోని వినాయక మండపాలను గురువారం ఆయన పరిశీలించారు. నిర్వహణ కమిటీలకు పలు సూచనలు చేశారు. విగ్రహాల నిమజ్జన ఊరేగింపులను ట్రాఫిక్‌కు అంతరాయం కలగకుండా భక్తిశ్రద్ధలతో ప్రశాంతంగా జరుపుకోవాలన్నారు. రాత్రి సమయాలలో మండపాల వద్ద కమిటీలు కాపలాగా ఉండాలన్నారు.ఊరేగింపులలో డిజెలను వినియోగించవద్దన్నారు. విగ్రహాలను నిమజ్జనం చేసే కాలువల వద్దకు చిన్నపిల్లలను అనుమతించవద్దన్నారు. రాత్రి సమయాలలో నిమజ్జనాలు జరపవద్దన్నారు. ఊరేగింపుల్లో విద్వేషాలు, వివాదాలకు తావిచ్చే పాటలను ప్రదర్శించకూడదన్నారు. మండపాల వద్ద అవాంఛనీయ సంఘటనలు చోటు చేసుకుంటే అందుకు నిర్వహణ కమిటీలే బాధ్యత వహించాల్సి ఉంటుందని ఎస్పీ స్పష్టం చేశారు. ఎస్పీ వెంట డీఎస్పీ సిహెచ్. రాజా, సీఐ నాగేంద్రప్రసాద్ తదితరులు ఉన్నారు. **గూడూరు :** వినాయక విగ్రహాల నిమజ్జనం ప్రశాంత వాతావరణంలో జరిగేలా అందరూ సహకరించాలని ఎస్పీ ఆర్. గంగాధరరావు అన్నారు. గూడూరు మండలం ఆకులమన్నాడు, కప్పలదొడ్డి గ్రామాల్లో వినాయక విగ్రహాలు ఏర్పాటు చేసిన పందిళ్లను సందర్శించారు. వినాయక నిమజ్జనాలు జరిపే ప్రదేశాన్ని సందర్శించి నిర్ణీత సమయంలోనే నిమజ్జనం పూర్తి చేయాలన్నారు. బందరు డీఎస్పీ సిహెచ్. రాజా, సీఐ నాగేంద్రకుమార్, ఎస్సై సత్యనారాయణ, సిబ్బంది పాల్గొన్నారు.



ఫ్లెక్సీలకు అనుమతి తీసుకోవాలి : డీఎస్పీ

మచిలీపట్నం క్రైమ్ : ప్రజలందరూ పండుగలను భక్తి శ్రద్ధలతో శాంతి భద్రతల నడుమ నిర్వహించుకోవాలని బందరు డీఎస్పీ సిహెచ్ రాజా కోరారు. పండుగల సందర్భంగా బహిరంగ ప్రదేశాల్లో ఏర్పాటు చేసే ఫ్లెక్సీలకు పోలీసు, మున్సిపల్ అధికారుల అనుమతులు తప్పని సరిగా ఉండాలని గురువారం ప్రకటనలో తెలిపారు. అనుమతులు తీసుకోకుండా ఏర్పాటు చేసిన ఫ్లెక్సీలు, హోర్డింగ్స్ తొలగిస్తామన్నారు. పండగ అయిన తరువాత ఏర్పాటు చేసిన వారే వాటిని తొలగించే బాధ్యత తీసుకోవలన్నారు. పోలీసు, మున్సిపల్ సిబ్బందికి ప్రజలంతా సహకరించటం ద్వారా శాంతియుత వాతావరణంలో పండుగలు నిర్వహించుకోవాలని డీఎస్పీ రాజా కోరారు.



బందరు హిందూ కళాశాల వద్ద వినాయకుడికి పూజలు



అర్తమూరులో ఏర్పాటు చేసిన వినాయకుడి విగ్రహం..



నాగాయలంకలో డీఎస్పీ విద్యశ్రీ పూజలు



ఇత్తడి వస్తువులతో గోళ్ల ఝాన్సీ చేసిన విగ్రహం

ప్రజలందరికీ వినాయకుడి కృప

• చవితి వేడుకల్లో మంత్రి రవీంద్ర ఆకాంక్ష

మచిలీపట్నం టౌన్, ఆగస్టు 28 (ఆంధ్రజ్యోతి) : వినాయకుని కృప అందరికీ ఉండాలని మంత్రి కొల్లు రవీంద్ర ఆకాంక్షించారు. చమ్మనగిరిపేటలోని సంతోష్‌హోటల్ వద్ద నిలువెత్తు వినాయక విగ్రహాన్ని మంత్రి కొల్లు రవీంద్ర సందర్శించారు. కారం మిల్లు యజమానులు, వెల్డింగ్ వర్కర్లు మూడు దశాబ్దాలుగా వినాయక నవరాత్రి ఉత్సవాలు నిర్వహిస్తున్నారన్నారు. ఈ ఏడాది 14 అడుగుల ఎత్తైన విగ్రహాన్ని ఏర్పాటు చేశారు. కామధేనువు, చిరుగంటలు కొడుతున్న వినాయకుని విగ్రహం ఏర్పాటు చేసిన వన్నెంరెడ్డి లక్ష్మణకుమార్, అతని సహాయకులు నాగరాజు, నాగేంద్రరావు, రవికుమార్‌లను మంత్రి అభినందించారు. గోకుల శివ, శివగంగ పీఏసీఎస్ అధ్యక్షుడు పిప్పళ్ళ కాంతారావు, మోటమర్రి బాబాప్రసాద్ తదితరులు పాల్గొన్నారు. పెద ఉల్లింగిపాలెం గంగానమ్మ గుడి వద్ద 16 అడుగుల వినాయక విగ్రహం అందరినీ ఆకట్టుకుంటోంది. గొడుగుపేట పాత కరెంటు ఆఫీసు వద్ద గణేష్ ఉత్సవ కమిటీ ఆధ్వర్యంలో ఏనుగు అంబారీపై గణేష్ విగ్రహం ఏర్పాటు చేయగా, మంత్రి కొల్లు రవీంద్ర సందర్శించి, పూజలు జరిపారు. వివిధ ప్రాంతాల్లో ఏర్పాటు చేసిన వినాయకుని విగ్రహాలు ప్రత్యేకతను చాటుకున్నాయి. సాంస్కృతిక కార్యక్రమాలు అలరించాయి. చెమ్మనగిరిపేటలో ఇత్తడి వస్తువులతో కళాకారిణి రూపొందించిన వినాయక ప్రతిమ భక్తులను ఆకట్టుకుంటోంది. గోళ్ల ఝాన్సీ గత 27 ఏళ్లగా సృజనాత్మకతతో వివిధ వస్తువులతో వినాయక ప్రతిమలు రూపొందిస్తూ ప్రత్యేకతను చాటుతున్నారు. ఈ ఏడాది వైవిధ్యంగా ఇత్తడి వస్తువులతో వినాయక ప్రతిమను తయారు చేసి ప్రజల మన్ననలందుకున్నారు. **పెడన రూరల్ :** మండలంలోని చెన్నూరు, ఉరివి, చేవేంద్ర, నడమూరు, కాకర్లమూడి, నందిగం, నడుపూరు, కూడూరు, పెనుమల్లి, బల్లిపర్రు, కొంకేపూడి తదితర గ్రామాలలో వినాయక చవితి వేడుకలు ఘనంగా నిర్వహించారు. యువకులు, పెద్దలు గ్రామాల కూడళ్ళలో చలువ పందిళ్ళు వేసి భారీ వినాయక విగ్రహాలను ఏర్పాటుచేసి పూజలు నిర్వహించారు. **పెడన :** పట్టణంలో వినాయక స్వామి నిమజ్జనోత్సవం గురువారం వైభవంగా జరిగింది..



ఘంటసాలలో పూజ చేస్తున్న ముస్లిం దంపతులు



మోపిదేవిలో మట్టి గణపతి



చల్లపల్లి శ్రీలక్ష్మీగణపతి దేవాలయం వద్ద...

పట్టణంలో 40 గణేష్ మండపాలు ఉండగా వాటిలో 10 మండపాల నిమజ్జన ఊరేగింపులు గురువారం జరిగాయి. ఎస్పీ గంగాధరరావు రామరాజుపాలెం కాలువలో నిమజ్జనాలు తీరును పరిశీలించారు. **ఘంటసాల :** జలదీశ్వరస్వామి ఆలయ ప్రాంగణంలో వినాయక చవితి వేడుకలను వైభవంగా నిర్వహించారు. గ్రామానికి చెందిన ముస్లిం దంపతులు షేక్ బాషా - షర్మిల (శ్రీదేవి) దంపతులు గణనాథునికి విశేష పూజలు నిర్వహించి సర్వమత సమాన త్వాన్ని చాటారు. శ్రీకాకుళం డీసీ ఛైర్మన్ అయినపూడి భాను ప్రకాష్, జడ్పీ మాజీ ఉపాధ్యక్షులు గొర్రెపాటి వెంకట రామకృష్ణ, భక్తులు పాల్గొన్నారు. **బంటుమిల్లి :** గణేష్ ఉత్సవాలు ఘనంగా జరుగుతున్నాయి. స్వామివారికి ప్రత్యేక పూజలు, భజనలు, హరికథలు, సాంస్కృతిక కార్యక్రమాలు భక్తిశ్రద్ధలతో జరిపారు. వర్షాన్ని లెక్క చేయకుండా భక్తులు బారులు తీరారు. **చల్లపల్లి :** ప్రధాన సెంటర్లోని లక్ష్మీగణపతి దేవాలయం వద్ద ఉత్సవ పందిరిలో అడపా రాంబాబు, గురవయ్య దంపతులు పీటలపై ప్రధాన అర్చకులు వేమూరి శ్రీనివాసరావు అర్చకత్వంలో పూజలు నిర్వహించారు. లక్ష్మీపురంలోని మహావిద్యాగణపతి స్వామి ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహిస్తున్నారు గ్రామాల్లో ఆలయాలు, చలువ పందిళ్లలో గణపతి ఉత్సవలు వైభవంగా జరుగుతున్నాయి. **మోపిదేవి :** మోపిదేవిసుబ్రహ్మణ్యేశ్వరస్వామి ఆలయం, పెద కళ్లేపల్లి దుర్గానాగేశ్వరస్వామి దేవాలయంలో ప్రత్యేకంగా మట్టితో తయారు చేసిన విగ్రహాలను ఏర్పాటు చేశారు. ఈవో దాసరి శ్రీరామవర ప్రసాదరావు ఆధ్వర్యంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. వెంకటాపురం, కె.కొత్తపాలెం, పెదప్రోలు, రావివారిపాలెం గ్రామాల్లో గణనాథుని విగ్రహాలను భక్తులు సందర్శించారు. **అవనిగడ్డ రూరల్ :** పాత ఎడ్లంక గ్రామంలో గ్రామపంచాయతీ కార్యాలయం వద్ద పోలవరపు మల్లిఖార్జున - శైలజ దంపతుల కుమారుడు పోలవరపు దినేష్ ఆధ్వర్యంలో వినాయకుని ఏర్పాటు చేసి పూజలు నిర్వహించారు. వేకనూరులో మాదివాడ వారి రాలమయం ఆవరణలో ప్రసన్న గణపతి నవరాత్రి ఉత్సవాలు వైభవంగా ప్రారంభమయ్యాయి. వైఖానస ఆగమ పండితులు టి.ఆనందబాబు పూజలు నిర్వహించారు. **కోడూరు :** మండలంలో 53 ప్రాంతాల్లో ఉత్సవ కమిటీల ఆధ్వర్యంలో గణనాథుని భారీ ప్రతిమలు ఏర్పాటు చేశారు. అర్చకులు విశేష అలంకరణ చేయగా, భక్తులు దర్శించి విశేష పూజలు చేశారు. **నాగాయలంక :** ప్రసన్న గణపతికి అర్చకులు సాయి కిరణ్ శర్మ ఆధ్వర్యంలో డీఎస్పీ విద్యశ్రీ ప్రత్యేక పూజలు చేశారు. ఉత్సవ కమిటీ సభ్యులు మండవ బాలవర్ధిరావు, చిట్టా సాంబశివరావు, బండ్రెడ్డి వెంకటేశ్వరరావు, తాడికొండ సత్యనారాయణ, ఉప్పల భూపాల్ సింగ్, తలశిల తాతయ్య, గడ్డిపాటి ప్రసాద్, చిట్టా హరేరామ్, చిట్టా శివనాగేశ్వరరావు, బండ్రెడ్డి సుబ్బారావు పాల్గొన్నారు.

నిమజ్జనానికి ఏర్పాట్లు

ఘంటసాల : కృష్ణానదిలో నిమజ్జనోత్సవ కార్యక్రమాన్ని చేసుకునేందుకు శ్రీకాకుళం గ్రామపంచాయతీ ప్రత్యేక ఏర్పాట్లు చేస్తోంది. కృష్ణానది వైపు రహదారికిరువైపులా జంగిల్ క్లియరెన్స్ చేపట్టారు. గణనాథులను తీసుకొచ్చే వాహనాలకు ఎటువంటి ఇబ్బందులు కలుగకుండా ఉండేలా ప్రత్యేక ఏర్పాటు చేస్తున్నారు. వరద ఉధృతిని దృష్టిలో ఉంచుకుని భక్తులు కూడా కృష్ణానది లోపలికి వెళ్లకుండా ఉండేలా రెవెన్యూ, పోలీసు అధికారులు కట్టుదిట్టమైన బందోబస్తు ఏర్పాట్లు చేస్తున్నారు. సర్పంచ్ ముప్పనేని రవి ప్రసాద్, ఎస్సై ప్రతాప్ రెడ్డి, కార్యదర్శి జి.శ్రీనివాసరావు, వీఆర్వో గోపి, జనసేన పార్టీ నాయకులు సుగ్గన పవన్ కుమార్, కొండవీటి శ్రీనివాసరావు తదితరులు పర్యవేక్షిస్తున్నారు.

విద్యుత్ భారాలను తగ్గించాలి

• బందరు, బంటుమిల్లిలో వామపక్షాల ధర్నా

మచిలీపట్నం టౌన్, ఆగస్టు 28 (ఆంధ్రజ్యోతి) : ప్రజలపై విద్యుత్ భారాలను తగ్గించాలంటూ వామపక్షాల ఐక్య వేదిక ఆధ్వర్యంలో గురువారం రేవతి టాకీసు సెంటర్‌లో ధర్నా నిర్వహించారు. సీపీఎం జిల్లా కార్యదర్శి వై.నరసింహారావు మాట్లాడుతూ, స్మార్ట్ మీటర్ల వల్ల సామాన్యులపై ఆర్థిక భారం పడుతుందన్నారు. సీపీఐ సీనియర్ నాయకుడు మోదుమూడి రామారావు మాట్లాడుతూ, విద్యుత్ పంపిణీ, నిర్వహణ వ్యవస్థలను ప్రైవేటుకు అప్పగించడాన్ని వ్యతిరేకిస్తున్నామన్నారు. మీటర్ రీడింగ్ తీస్తూ జీవనం సాగిస్తున్న కార్మికులు జీవనోపాధిని కోల్పోయే ప్రమాదం ఏర్పడుతుందన్నారు. సీపీఎం నాయకులు బి సుబ్రహ్మణ్యం, సిహెచ్ రాజేష్, సిహెచ్ జయరావు, టి చంద్రపాల్, ఎస్.ధనుంజయరావు, కె.రాజారావు, ఎండి యూనస్, ఏడుకొండలు, ఎం.ఎస్.నారాయణ, మహిళా సంఘం నాయకురాలు డి. నిర్మల, వడుగు చైతన్యకుమార్, వడుగు రత్నకుమారి, రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు. **బంటుమిల్లి :** విద్యుత్ వినియోగదారులపై అదనపు భారాలు నిలిపివేవేయాలని డిమాండ్ చేస్తూ సీపీఎం ఆధ్వర్యంలో బంటుమిల్లిలో నిరసన తెలిపారు. స్మార్ట్ మీటర్లతో సామాన్యుడిపై అదనపు భారం పడుతుందన్నారు. మాజేటి శివశ్రీనివాసరావు, అజయ్‌ఘోష్, పొదిలి వెంకన్న, కృష్ణ, శ్యామ్‌సుందర్ చంద్రశేఖర్, బాజీ తదితరులు పాల్గొన్నారు.



రేవతి సెంటర్ వద్ద ధర్నా కార్యక్రమంలో మాట్లాడుతున్న వామపక్షాల నేతలు మోదుమూడి రామారావు, వై.నరసింహారావు



రావెళ్ల కృష్ణ చిత్రపటానికి నివాళులర్పిస్తున్న టీడీపీ నేతలు,



పంచాయతీ కార్మికులకు దుస్తులు పంపిణీ చేస్తున్న కుటుంబ సభ్యులు

చిరస్మరణీయుడు రావెళ్ల కృష్ణ

• 24వ వర్ధంతిలో టీడీపీ నేతల నివాళి

చల్లపల్లి, ఆగస్టు 28 (ఆంధ్రజ్యోతి) : ప్రజల హృదయాల్లో చిరస్థాయిగా నిలిచిన నాయకుడు రావెళ్ల కృష్ణ అని పలువురు వక్తలు పేర్కొన్నారు. మండల టీడీపీ నేత రావెళ్ల కృష్ణ 24వ వర్ధంతిని రావెళ్ల కృష్ణ సేవాసమితి ఆధ్వర్యంలో గురువారం నిర్వహించారు. మంగళాపురం గ్రామంలోని కృష్ణ విగ్రహాలకు పూలమాలలు వేసి నివాళులు అర్పించిన అనంతరం ర్యాలీగా మేకావారిపాలెంలోని ఆర్‌కె కన్వెన్షన్‌కు చేరుకున్నారు. కన్వెన్షన్ హాలులో రావెళ్ల కృష్ణ సంస్మరణ సభను నిర్వహించారు. నియోజకవర్గ పరిశీలకులు కనపర్తి శ్రీనివాసరావు, జిల్లా గ్రంథాలయ సంస్థ మాజీ చైర్మన్ గొర్రెపాటి గోపీచంద్, యువనేత మండలి వెంకట్రామ్ మాట్లాడుతూ, మంగళాపురం అభివృద్ధికీ, పేద ప్రజల కోసం రావెళ్ల కృష్ణ చేసిన కృషి అనిర్వచనీయమన్నారు. రావెళ్ల కృష్ణ ఆశయాలను కొనసాగిస్తూ కుమారులు రావెళ్ల ఉదయ్‌కుమార్, ప్రవీణ్‌కుమార్ పార్టీకి వెన్నుదన్నుగా నిలవటమే కాకుండా పేదలకు సాయమందించటం స్ఫూర్తిదాయకమన్నారు. తొలుత నేతలు రావెళ్ల కృష్ణ సిలికాన్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. కుమారులు రావెళ్ల ఉదయ్‌కుమార్, ప్రవీణ్‌కుమార్‌ల దాతృత్వంతో పలు సేవా కార్యక్రమాలు నిర్వహించారు. చల్లపల్లి గ్రామపంచాయతీ పారిశుధ్య కార్మికులు 30 మందికి దుస్తులను పంపిణీ చేశారు. ప్రతిభావంతులైన పేద విద్యార్థులకు, టీడీపీ కార్యకర్త వైద్య ఖర్చుల నిమిత్తం రూ.38 వేల ఆర్థికసహాయం చేశారు. ఏఎంసీ, డీసీ, సొసైటీ ఛైర్మన్లను అతిథుల చేతులమీదుగా సన్మానించారు. సేవాసమితి కార్యదర్శి రావెళ్ల విజయ్‌కుమార్ అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో కృష్ణ సతీమణి రావెళ్ల సుజాత, డీసీ ఛైర్మన్లు నిడమానూరి దిలీప్‌కుమార్, అయినపూడి భానుప్రకాష్, మాజీ ఛైర్మన్ నూకల లక్ష్మయ్య, జడ్పీ మాజీ వైస్ ఛైర్మన్ గొర్రెపాటి వెంకట రామకృష్ణ, మండల టీడీపీ అధ్యక్షుడు మోర్ల రాంబాబు, మాజీ ఎంపీపీ యార్లగడ్డ లంకబాబు, టీడీపీ నేతలు యార్లగడ్డ శ్రీనివాసరావు, వీరమాచినేని భవానీప్రసాద్ ముమ్మనేని నాని, తాతినేని చినపూర్ణ, రావి నాగేశ్వరరావు ప్రసంగించారు. సొసైటీ ఛైర్‌పర్సన్‌లు గుత్తికొండ వంశీకృష్ణ, మల్లుపెద్ది దుర్గామహేష్, పరుచూరి వెంకటేశ్వరరావు, చల్లపల్లి సీఐ కె.ఈశ్వరరావు, సర్పంచ్ పైడిపాముల కృష్ణకుమారి, ఏఎంసీ ఛైర్మన్లు తోట కనకదుర్గ, కొల్లూరు వెంకటేశ్వరరావు, ఎస్సై పి.సుబ్రహ్మణ్యం, పరుచూరి కమలాకరరావు, చంద్ర వెంకటేశ్వరరావు, మోర్ల శివ, వాసిరెడ్డి రాకేష్, టీడీపీ నేతలు, కార్యకర్తలు పాల్గొన్నారు.

రెయిన్ కోట్లు పంపిణీ

అవనిగడ్డ రూరల్, ఆగస్టు 28 (ఆంధ్రజ్యోతి) : పులిగడ్డలో పని చేస్తున్న పారిశుధ్య కార్మికులకు కార్యదర్శి అనిత సొంత డబ్బులతో రెయిన్ కోట్లు అందజేశారు. పంచాయతీ సర్పంచ్ దాసరి విజయ్ కుమార్ చేతుల మీదుగా వాటిని కార్మికులకు అందించారు.

మోపిదేవి తహసీల్దార్‌గా హరినాథ్

మోపిదేవి, ఆగస్టు 28 (ఆంధ్రజ్యోతి) : మోపిదేవి తహసీల్దార్‌గా ఎం.హరినాథ్ గురువారం బాధ్యతలు స్వీకరించారు. కలెక్టరేట్‌లో ల్యాండ్ అక్విజేషన్ స్పెషల్ తహసీల్దార్‌గా పని చేస్తున్న హరినాథ్ మోపిదేవికి బదిలీపై వచ్చారు. రైతులు, ప్రజలు ఆఫీసు పని చేసే వేళల్లో స్వయంగా వచ్చి తమ సమస్యలు తెలియజేయవచ్చునని తెలిపారు. కార్యాలయ ఉద్యోగులు, రెవెన్యూ ఉద్యోగులు పుష్పగుచ్ఛం అందజేసి అభినందనలు తెలిపారు.


ఇందిరమ్మ కాలనీలో ఫీవర్ సర్వే

గూడూరు, ఆగస్టు 28 (ఆంధ్రజ్యోతి) : గూడూరు ఇందిరమ్మ కాలనీలో గురువారం మల్లవోలు పీహెచ్‌సీ వైద్య సిబ్బంది ఫీవర్ సర్వే నిర్వహించారు. నీరు నిల్వ ఉంచరాదన్నారు. డెంగ్యూ, మలేరియా, చికున్ గున్యా వ్యాధుల నివారణకు తీసుకోవాల్సిన జాగ్రత్తలపై కరపత్రాలు పంపిణీ చేశారు. హెల్త్ అసిస్టెంట్ సుబ్రహ్మణ్యం, ఏఎన్ఎం అరుణాదేవి, ఆశ వర్కర్ కృష్ణ పాల్గొన్నారు.

పంటల బీమాపై అవగాహన

కోడూరు, ఆగస్టు 28 (ఆంధ్రజ్యోతి) : రైతులు పంట బీమా ప్రీమియం చెల్లిస్తే విపత్కర పరిస్థితుల్లో రైతులకు భరోసా కల్పిస్తుందని బడేవారిపాలెం పీఏసీఎస్ అధ్యక్షుడు మర్రె గంగయ్య అన్నారు. పీఏసీఎస్ కార్యాలయం వద్ద సెక్రటరీ బడే సురేష్ అధ్యక్షతన రైతులకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. పాస్‌బుక్ జిరాక్స్, అడంగల్ జిరాక్స్ అందించి ప్రీమియం చెల్లించాలని తెలిపారు. రైతులు, సంఘ సభ్యులు పాల్గొన్నారు.

నాగేశ్వరరావు మాస్టారు మృతి



ఘంటసాల, ఆగస్టు 28 (ఆంధ్రజ్యోతి) : తాడేపల్లి గ్రామానికి చెందిన విశ్రాంత ఉపాధ్యాయుడు మొవ్వ నాగేశ్వరరావు (75) బుధవారం రాత్రి మృతి చెందారు. ఆయనకు భార్య, ఇద్దరు కుమారులు. నాలుగు నెలల రోడ్డు ప్రమాదానికి గురైన ఆయనకు విజయవాడలో వైద్యం అందించారు. ఆరోగ్యంగా మెరుగుపడక మాస్టారు మృతి చెందినట్లు కుటుంబసభ్యులు తెలిపారు. నాగేశ్వరరావు మాస్టారు మంత్రిపాలెం, కాజ, శ్రీకాకుళం, మొవ్వ కొడాలి హైస్కూల్‌లో గణిత ఉపాధ్యాయుడిగా పని చేసి ఎంతో మంది విద్యార్థులను తీర్చిదిద్దారు. 2007లో రాష్ట్ర ఉత్తమ ఉపాధ్యాయ అవార్డును అందుకున్నారు. మాస్టారు మృతి పట్ల పలువురు సంతాపాన్ని వ్యక్తం చేశారు.

ట్రైనీ కలెక్టర్ ఫర్హీన్ జహీద్ చల్లపల్లి పర్యటన



నారాయణరావునగర్ మోడల్ పాఠశాలను సందర్శిస్తున్న ట్రైనీ కలెక్టర్ ఫర్హీన్ జహీద్

చల్లపల్లి, ఆగస్టు 28 (ఆంధ్రజ్యోతి) : ట్రైనీ కలెక్టర్ ఫర్హీన్ జహీద్ గురువారం చల్లపల్లిలో పర్యటించారు. శిక్షణలో భాగంగా చల్లపల్లి గ్రామపంచాయతీ కార్యాలయానికి వచ్చి కార్యదర్శి విధులు, బాధ్యతలు తెలుసుకున్నారు. గ్రామసభలు, పంచాయతీ సమావేశాల నిర్వహణ, ఆదాయ వ్యయాలు, రికార్డుల నిర్వహణ, క్యాష్‌బుక్స్, బిల్స్, ఇంటి పన్ను తదితర అంశాలను కార్యదర్శి పి.వి.మాధవేంద్రరావు వివరంగా తెలియజేశారు. పంచాయతీ రికార్డులను జహీద్ పరిశీలించారు. చల్లపల్లి ఒకటో సచివాలయాన్ని సందర్శించి ఉద్యోగుల విధుల నిర్వహణను పరిశీలించారు. నారాయణరావునగర్‌లోని మోడల్ ప్రాథమిక పాఠశాలను సందర్శించి మధ్యాహ్న భోజన పథకాన్ని పరిశీలించి పిల్లలతో మాట్లాడారు. విద్యార్థుల సంఖ్య, హాజరుశాతం తదితర వివరాలను హెచ్‌ఎం కైతేపల్లి దాస్ తెలియచేశారు. మోడల్ అంగన్‌వాడీకేంద్రాన్ని పరిశీలించి పిల్లలతో ముచ్చటించారు. సంపద తయారీ కేంద్రాన్ని సందర్శించి వర్మి కంపోస్ట్ తయారీ గురించి తెలుసుకున్నారు. గ్రామపంచాయతీ పార్కును సందర్శించారు. గ్రామసర్పంచ్ పైడిపాముల కృష్ణకుమారి, ఈవో పి.వి.మాధవేంద్రరావు తదితరులున్నారు.



తరకటూరులో మాట్లాడుతున్న న్యాయాధికారి రామకృష్ణయ్య

బాల్య వివాహాలు నేరం

గూడూరు, ఆగస్టు 28 (ఆంధ్రజ్యోతి) : బాల్య వివాహాలు నేరమని సీనియర్ సివిల్ జడ్జి రామకృష్ణయ్య అన్నారు. తరకటూరు జిల్లా పరిషత్ హైస్కూల్‌లో గురువారం జరిగిన న్యాయ విజ్ఞాన సదస్సులో ఆయన ముఖ్యఅతిథిగా పాల్గొని మాట్లాడారు. బాల్య వివాహాల వల్ల జరిగే నష్టాలను వివరించారు. ఎస్టీ సంక్షేమ అధికారి ఫణిధూర్జటి, న్యాయవాది చీలి ముసలయ్య, గ్రామ సర్పంచ్ చిన్నం వెంకటరమణయ్య, పోలీసు, వైద్య అధికారులు, విద్యా కమిటీ చైర్మన్ తదితరులు పాల్గొన్నారు. పాఠశాల ఇన్‌ఛార్జి ప్రధానోపాధ్యాయురాలు అరుణ అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో పాఠశాల సిబ్బంది, తల్లిదండులు పాల్గొన్నారు.